AL-HiLaL

నెలవంక

షాబాన్ హిజ్రి శకం 1433

Vol 8, Issue: 69 July - 2012

nelavankaonline.com

مجلة الهلال (باللغة التلغوية) - ملحق مجلة البشرى

రమజాను మాసమా!
మార్పు నీ చిరునామ!!



క్విజ్ పోటీల్లో పాల్గొనండి
విలువైన బహుమతులు గెలుచుకోండి

IPC
لجنة التعريف بالإسلام
ISLAM PRESENTATION COMMITTEE
جمعية النجاة الخيرية

جمعية النجاة الخيرية

بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ

ఖుర్‌ఆన్

అవతరించిన మాసం రమజాన్

"రమజాను మాసం ఖుర్‌ఆన్ అవతరించిన మాసం. అది మానవు లందరికీ మార్గదర్శకం. అందులో సన్మార్గంతోపాటు సత్యాసత్యాలను వేరుపర్చే స్పష్టమైన నిదర్శనాలున్నాయి. కనుక మీలో ఎవరు ఈ మాసాన్ని పొందుతారో వారు విధిగా ఉపవాసాలు ఉండాలి. ".

(దివ్యఖుర్‌ఆన్- 2: 185)

షరీయతుని అనుసరిస్తూ ప్రతి ముస్లిం నిర్ణీత కాలం వరకు ఉపవాసం ఉండాలి. ఒక రోజు ముందుగాని, ఒక రోజు వెనుక గానీ చేయకూడదు. "మీరు (రమజాను) నెలవంకను **చూసి ఉపవాసాలుండండి. మళ్ళీ మీరు (షవ్వాల్) నెలవంకను చూసి ఉపవాసాల్ని విరమించండి"** అని మహా నీయ ముహమ్మద్ (స) వారు సెలవి చ్చారు. (ముత్తఫఖున్ అలైహి)



'నా సముదాయం వేగిరంగా (తొందరగా) ఇఫ్తార్ చేస్తున్నంత కాలం వారు శుభాన్ని పొందుతూనే ఉంటారు" అన్నారు మహా నీయ ముహమ్మద్ (స). (ముస్నద్ అహ్మద్) అయితే మరీ ఆలస్యం, మరీ తొందర చేయ కూడదు.



ఉపవాసం అంటే కేవలం ఆహారపానీ యాలకు నిర్ణీత కాలం వరకు దూరం గా ఉండటం మాత్రమే కాదు. దైవ నిషేధాలన్నింటికి దూరంగా మసలుకో వాలి. **"ఎవరయితే రోజా పాటిస్తూ కూడా ఆసత్యం పలకడం, ఆసత్యాన్ని ఆచరించటం మానడో అటువంటివాడు ఆకలిదప్పులతో ఉండటం పట్ల అల్లాహ్‌కు ఏ మాత్రం ఆసక్తి లేదు"** అని ఉపదేశించారు మహనీయ ముహమ్మద్ (స). (బుఖారీ)

"ఏ వ్యక్తి ధర్మనిష్ఠతో, పుణ్యఫలాపేక్షతో రమజాను రోజాలు పాటిస్తాడో అతను పూర్వం చేసిన పాపాలు మన్నించబడ తాయి. ఎవరయితే భక్తి ప్రపత్తులతో, ఆత్మపరిశీలనతో (స్వర్గ) ఫలాపేక్షతో తరావీహ్ నమాజు చేస్తాడో అతడు పూర్వం చేసిన అపరాధాలు క్షమించ బడతాయి" అని మహనీయ ముహ మ్మద్ (స) అన్నారు.

(ముత్తఫఖున్ అలైహి)

"రోజా డాలు వంటిది. మీలో ఎవర యినా రోజా పాటిస్తున్నట్లయితే,అతను అశ్లీల పలుకులు పలుకరాదు. అల్లరి చేష్టలు చేయరాదు. ఇతరులెవరయినా తిట్టినా, జగడానికి దిగినా, **'నేను ఉప వాసంతో ఉన్నాను'** అని చెప్పెయ్యాలి" అని ప్రబోధించారు మహనీయ ముహ మ్మద్ (స). (బుఖారీ, ముస్లిం)

"రోజా మరియు ఖుర్‌ఆన్ విశ్వాసి కొరకు సిఫారసు చేస్తాయి. రోజా అంటుంది:
'ప్రభూ! నేను ఇతన్ని పగలల్లా భోజ నానికి, ఇతరత్రా వాంఛలకు దూరం చేశాను, ఇతని విషయంలో నా సిఫా రసును స్వీకరించు'. అలాగే ఖుర్‌ఆన్ అంటుంది:
'నేను ఇతన్ని రాత్రిళ్ళలో సుఖనిద్రకు దూరం చేశాను కనుక స్వామీ! ఇతని ఎడల నా సిఫారసును స్వీకరించు'. అప్పుడు అల్లాహ్ ఈ రెంటి సిఫారసు ను స్వీకరిస్తాడు". అన్నారు ప్రవక్త (స).

(బైహఖీ, మిష్కాత్)

NIVANIKA
సామాజిక, సాంస్కృతిక, సందేశాత్మక మాస పత్రిక

AL-HiLaL
నెలవంక
మాసపత్రిక

(AL-HILAL MONTHLY)

Vol 8, ISSUE: 69
July - 2012

CHIEF PATRON
Muhammad Ismail Ansari

GENERAL SUPERVISION
Khalid Al-Sab'a

EDITOR
Syed Abdus Salam Omeri

ASSOCIATE EDITOR
Sk. Habeebur Rahman Jamaee

EDITORIAL BOARD
Sk. Abdus Salam Omeri
Sk. MOHAMMED SALEEM JAMAEE
Sk. Muhammad Bilal
Tahera Begum

PHONE
Syed Abdus Salam Omeri
97266676

FAX
22400057

P.O.BOX: 1613
SAFAT-13017, KUWAIT

PUBLISHED BY

IPC
ISLAM PRESENTATION COMMITTEE

Islam Presentation Committee
Kuwait
www.ipc.org.kw

مؤسسة زخرف للدعاية والإعلان
Zukhruf Advertising Agency

www.zukhruf.net

ఈ సంచికలో....



రమజాను మాసమా! మార్పు నీ చిరునామ



స్వర్గంధామం



ఓ మనిషీ! నిన్ను నువ్వు తెలుసుకో!!

"ఓ ప్రజలారా! ఒక మహోజ్వలమయిన, ఎనలేని శుభాల మాసం త్వరలో రానున్నది. అందులో ఒక్క రేయి ఉంది. అది వేయి నెలలకంటే ఎంతో శుభప్రదమయి నది. అల్లాహ్ ఈ మాస ఉపవాసాల్ని పాటించటం విధి గా చేశాడు. ఈ నెల రాత్రి తరావీహ్ నమాజుల్ని నఫిల్ గా చేశాడు. ఈ మాసంలో ఎవరయినా ఒక సత్కార్యా న్ని అంతర్ ప్రేరణతో, సంతోషంగా చేస్తే, అది ఇతర మాసాల్లో విధిని నిర్వర్తించిన దానికి సమానం. ఎవర యినా ఈ మాసంలో ఫర్జ్‌ను నిర్వహిస్తే అది ఇతర నెలల్లో డెబ్భయి విధుల్ని నిర్వర్తించిన దానికి సమానం. ఇది సహనం వహించవలసిన మాసం. సహనానికి ప్రతిఫలం స్వర్గం. ఇది సమాజంలోని బీదసాదల పట్ల సానుభూతి వహించవలసిన మాసం". అని ప్రజలనుద్దే శించి ప్రవక్త (స) షాబాన్ చివరి తేదీన ప్రసంగించా రని హజ్రత్ సల్మాన్ ఫారసీ (ర) ఉల్లేఖించారు.

(మిష్కాత్- బలహీనమైనది - జయీఫ్)



నెలవంక ఒక చూపులో	2	రమజాను పోటీలు	12
రమజాను మాసమా! మార్పు నీ చిరునామ	3	ఓ మనిషీ! నిన్ను నువ్వు తెలుసుకో!!	14
స్వర్గధామం	4	మొక్కుబడి వాస్తవికత	16
కువైట్ ఆకర్షణా కేంద్రాలు	6	ముస్లిం వ్యక్తిత్వ వికాసానికి సూత్రాలు	18
మృదువుగా సలహాలివ్వాలి	7	నరకకూపం	20
ఆహారపానీయాలు ఆచారనియమాలు	8	ధర్మ ఖలీఫా అబూ బకర్ (ర)	22
రమజాన్ క్విజ్ పోటి నియమాలు	11	ఐపిసి వార్తలు	24

ماذا قدمت المجلة لأبناء الجالية - موسم الخيرات رمضان - الجنة ونعيمها - الأماكن الترفيهية - الرفق في الكلام - عادات وتقاليد في الأكل والشرب - المسابقة الثقافية - الربا كارثة للمجتمع - أعرف نفسك - حقيقة النذر - ثمان نصائح - النار وجحيمها - رجال حول الرسول صلى الله عليه وسلم - أخبار اللجنة



నెలవంక ఒక చూపులో

చరిత్ర: ఒక చిన్న చినుకు నీటిపాయగా, వాగుగా, వంకగా, నదిగా మారి మహా సముద్ర రూపం దాల్చినట్లు 'కువైట్‌లో నివసిస్తున్న తెలుగు జనుల మధ్య సదవగాహనను, సంఘీభావాన్ని పెంపొందింపజేసేందుకు, తెలుగు కమ్యూనిటిలో పాడుసూపే దురాచారాలు, దురలవాట్లను ఎప్పటికప్పుడు ఎత్తి చూపుతూ ప్రజల ఆలోచనలకు నిర్మాణాత్మక ఒరవడిని ఇచ్చేందుకు, ముఖ్యంగా యువతలో శీలనిర్మాణం కొరకు ప్రయత్నించేందుకు, ప్రజా బాహుళ్యంలో దైవసమ్మతమయిన జీవన విధానం అంతర్వాహినిలా ప్రవహించే విధంగా పాటు పడేందుకు, తెలుగు భాషా వైశిష్ట్యాన్ని చాటి చెబుతూ, దాని వికాసం కోసం ఇదోధిక కృషి జరపాలన్న సదుద్దేశ్యంతో ఒక ఆలోచన మొగ్గ తొడిగింది. అదే **నెలవంక** మాస పత్రిక. **'ఒక్కొక్క వ్యక్తి సమస్త శక్తి ధారపోసి కృషి చెయ్యాలి'** అన్నట్టే పత్రిక సంపాదకులు, రచయితలు, పాఠకులు, శ్రేయోభిలాషులు, అభిమానులు....ప్రతి ఒక్కరూ అశేషపూర్వకమైన తోడ్పాటుతో ఒక్కొక్క అడుగు ముందుకు వేస్తూ, సమాజ హితానికి పెద్ద పీట వేస్తూ, సత్యం కోసం సతతం శ్రమించే సత్యప్రియులకు, హల్నించే పాఠకులకు సరైన వేదికను సమకూర్చి, వారిని దాసుల దాస్యం నుండి వెలికి తీసి దైవ దాస్యం వనాల్లో విహరింప జేయడమే, వారిని కటిక చీకట్ల నుండి తీసి వెలుగు వెన్నెల్లో తడి స్నానాలు చేసేలా తీర్చిదిద్దడమే **నెలవంక** ముఖ్య ఆశయం. నవంబరు 2004 - రమజాను మాసపు శుభఘడియల్లో ముగ్గురు వ్యక్తుల అవిరళ కృషి, అవిశ్రాంత శ్రమతో ప్రారంభమయిన ఈ మాస పత్రిక తర్వాత - తమిళ, ఫిలిప్పీనీ, మళయాలం, ఉర్దూ, బెంగాలీ, సింహాళి భాషల్లో ఆరు మాస పత్రికలు వెలువడటానికి ప్రేరణగా, తలకట్టుగా నిలిచింది. ప్రవాసాంధ్రులకు, అనురాగ గోపురం, విశ్వాసుల మాతలు, ఇస్లాం మరియు సైకాలజీ, పవిత్ర జీవితం, అనురాగ రావం, ఇస్లాం శిక్షణ, పూ పరిమళం, జ్ఞానామృతం, కవితా కుసుమాలు అను శీర్షికలు, ఉపశీర్షికలతోపాటు సాంస్కృతిక పోటీలు, కార్యక్రమాల సమాచారం, ఖుర్‌ఆన్ పోటీలు, ప్రముఖుల ఇంటర్వ్యూలు, దేశాభిమాన వ్యాసాలతో **నెలవంక** శోభాయమానంగా అలరారింది. కాలం సాగుతున్నకొద్దీ, కొత్తగా వస్తున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ, ప్రపంచ వ్యాప్తంగా ఎందరో పాఠకులను, అభిమానులను కూడగట్టుకుంటూ **నెలవంక** నిరంతరము ఎదుగుతూనే ఉంది. అలా **నెలవంక** ఈ ఎనిమిదేళ్ళలో తనదైన కొత్త శైలికి నాంది పలికింది.. తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపును సంపాదించుకుంది. ఈ ఎదుగుదలకు మూర్గదర్శకత్వం చేసిన మూల స్థభాల్లో శ్రీ ముహమ్మద్ అజీజుర్రహ్మాన్, సోదరులు రాషిద్ ఫారూక్, మౌలానా ముజాహిద్ ఖాన్ ఉమ్రీ ప్రముఖులు. **నెలవంక**కు కొత్త రూపురేఖలు ఇవ్వడంలోనూ, **నెలవంక**కు సంపాదకునిగా బాధ్యతలు నిర్వహించడంలోనూ శ్రీ ముహమ్మద్ అజీజుర్రహ్మాన్ గారి కృషి అనితరసాధ్యం.

లక్ష్యం: గల్ఫ్ దేశాల్లో అచ్చమైన తెలుగులో, స్వచ్ఛమయి ఆకృతితో వెలువడే తొలి మాస పత్రిక ఘనత **నెలవంక**కే దక్కింది. 2004 నవంబరు మాసంలో శ్రీ ముహమ్మద్ అజీజుర్రహ్మాన్ గారు గౌరవ సంపాదకులుగా, సోదరులు రాషిద్ ఫారూఖ్ సాంకేతిక దిశా నిర్దేశంతో, మౌలానా ముజాహిద్ ఉమ్రీ సహాయకులుగా తొలి సంచిక వెలువడింది. ఈ పత్రిక ప్రతిపాదన వెనుక రెండు ముఖ్య కారణాలున్నాయి. **ఒకటి:** సర్వ జనామోదం పొందేలా పత్రికను ప్రామాణికంగా, పుత్తడి బొమ్మలా తీర్చిదిద్దడంతోపాటు, కువైట్‌లోని తెలుగు భాషాభిమానుల శిబిరాలలో ఇదో ఉత్తమ సాంస్కృతిక వారధిగా అలరారాలన్నది. స్వార్థ చింతన, లాభాపేక్ష లేకుండా, రాజకీయ వాదాలకు, వర్గాలకు అతీతంగా, రచయితలకూ, పాఠకులకూ స్నేహపూతరిత వాతావరణంలో ఒక ఉమ్మడి వేదికగా, హితైషిగా మనగలగడం. **రెండవది:** పలు మత వర్గాలతో సమన్వయాన్ని సాధించి, ఆయా సుముదాయాల, సమాజాలలో తిష్ఠవేసిన ఆధ్యాత్మిక, సామాజిక రుగ్మతలను, దురాచారాలను రూపుమాపి, అపార్థాలను దూరం చేసి, సరైన మార్గదర్శకత్వం ద్వారా వారిలో ధార్మిక, సామాజిక చైతన్యాన్ని రగుల్గొల్పి, వారిలోని సత్కార్తి తీర్చి, సత్య స్ఫూర్తితో ఇహపరాల సాఫల్యానికి మార్గం సుగమం చేయడం.

ఘనత: చివరికి ఈ క్రెడిట్, ఘనత మొత్తం ఐపిసి ధార్మిక సంస్థకే చెందుతుంది. ఐపిసి, ఐపిసి వంటి సమాజ హితాన్ని కోరే సంస్థలు ఎంతగానైతే సంఘంలో వర్ధిల్లుతాయో, అవినీతి, అక్రమాలు, అన్యాయాలు, అధర్మాలు అంతగానే నిర్మూలించబడతాయి. కారుణ్య ప్రభువైన అల్లాహ్ వారి ఈ చిరు కృషిని స్వీకరించి, దీని ద్వారా తెలుగు పాఠక లోకానికి ఇతోధిక ప్రయోజనం చేకూర్చాలని ప్రార్థిస్తున్నాము.

అభిలాష: మనం ప్రస్తుతం ఒక ఎల్లలు లేని ప్రపంచంలో ఉన్నాము. మన అనుభవాలు, అభిప్రాయాలు పెనువేగంతో మన చుట్టూ ఉన్న ప్రపంచంతోపాటు మారిపోతున్నాయి. ఈ మార్పులన్నింటిని ప్రతిఫలించగలిగే సాధనాలో సాహిత్యం ప్రధానమయినది. హితైషి సాహిత్య సృష్టికి తోడ్పడగల్గటం, సహేతుకమైన సాహిత్యాన్ని అందించడం ఏ ఒక్క పత్రిక మాత్రమే చేయగలిగే పని కాదు. ఇందుకు అనేక పత్రికల అవసరం ఉంది. గత కొన్నెళ్ళుగా అనేక ప్రతికలు తమకంటూ కొన్ని సాహితీ, ధార్మిక లక్ష్యాలు ఏర్పరచుకుని పరిశ్రమిస్తున్నాయి. అలా ఇస్లామీయ సాహిత్యాన్ని తెలుగు లోకానికి అందజేయడంలో తన 25 సంవత్సరాల అశేష సేవతో అగ్రభాగాన గీటురాయి వార పత్రిక ఉందనడంలో ఎలాంటి సందేహం లేదు. వీరికి, వీరిలా మరికొన్ని పత్రికలు వెలువరించాలన్న సదుద్దేశ్యంతో ఉన్నవారికి మా హృదయపూర్వక అభినందలతోపాటు వారికి మా సహాయసహకారాలు సదా ఉంటాయని తెలియజేసేందుకు సంతోషిస్తున్నాము.

విన్నపం: పత్రిక నిర్వహకులకు కావలసింది, కేవలం అర్థత, తీరిక మాత్రమే కాదు. అంతకంటే అవసరమైనవి ఉన్నాయి. ఆసక్తి, ఉల్లాసం, అంకిత భావం, స్పష్టమయిన దృక్పథం, నిస్వార్థ సేవ, చిత్తశుద్ధి, త్యాగనిరతి, న్యాయశీలత, సచ్ఛీలత వంటి సద్గుణాలు. ఇవే ఏ పత్రిక ప్రగతి కయినా పట్టుకొమ్మలు. పై పేర్కొన్న వాటన్నింటితోపాటు ప్రజల ప్రోత్సాహం, శ్రేయోభిలాషుల దీవెనలే ప్రస్తుతం **నెలవంక**ను నడుపుతున్న ధనమూ, ఇందనమూ. కాబట్టి **నెలవంక** మరింత ఎదిగేందుకు పనికొచ్చే మీ సహాయసహకారాలు, మీ విలువైన సూచనల కోసం నిరీక్షిస్తూ..... పాఠకులందరికీ **రమజాన్ శుభాకాంక్షల్ని** తెలిజేస్తున్నాము.

- బుష్రా ఫాతిమా

రమజాను మాసమా! మార్పు నీ చిరునామ



అది 2011 ఆగస్టు 22వ తేదీ లగాయతు రఫీ తమ్ముడు రఖీబ్ తాలూకు నేలపై నూకలు చెల్లిపోయాయి. ఆ రోజు రఖీబ్ ఆత్మ ఆతని శరీరాన్ని వీడి పోయింది. రఖీబ్ దొరికిన ఏ మంచి కార్యాన్ని ఇట్టే వదిలే రకం కాదు. అతనికి ధర్మావగాహన కలిగిన రోజు నుంచి ఎంతో నిష్ఠగా నియమబద్ధంగా జీవితం గడుపుతున్నాడు. ఆర్థిక ఇబ్బందులు అతన్ని ఎంతగా పీడించి, సంసార బాధ్యతలు ఎంతగా సతాయించినా, ఊరి జనం పిచ్చోడని విమర్శించినా అతను మాత్రం ధర్మం తప్పలేదు. దైవం గీసిన సరిహద్దు రేఖ దాటలేదు. దైవప్రవక్త (స) నిర్దేశించిన రీతిని వదల లేదు. బొందిలో ప్రాణమున్నంత వరకూ అల్లాహ్ దరిని వదిలి మరే దరి మీద, దర్గాహ్ మీద తల వంచ లేదు. న్యాయం, ధర్మం ముందు తప్ప మరే పీరు సాహెబు, బాబా సాహెబు ముందర తల దించలేదు, నయవంచనకు; ఆత్మవంచనకు పాల్పడ లేదు. ఏ అధర్మ కార్యంలో, ఏ ఉరుసు ఉత్సవాల్లో, ఏ పీర్ల సంబరాల్లో, ఏ గ్యారవీం విందులలోనూ అతను పాల్గొనలేదు. అతనిలో ఇంతటి మార్పుకి కారణం అతని జీవితంలో చోటు చేసుకున్న ఒకానొక రమజాను మాసం మరియు సజ్జనులైన స్నేహితులే. నేడు జనులందరి తలల్లో తలో నాలుకయ్యాడు. అతని నిష్ఠకుగానూ, అతని గుండె ధైర్యానికి, మనో స్థయిర్యానికిగానూ నింగినేలా నీరాజనాలు పడుతున్నాయి. అతనిలో వచ్చి మార్పునే జనులం దరిలోనూ చూడగోరుతున్నాయి.

ని జం - ఈ మాసంలో మానవాత్మలు, అంతరాత్మలు సచేతనంగా, సజీవంగా, సశ్యశామలంగా కమనీయ కాంతులీనుతూ ఉంటాయి. నిత్య నిర్మల మనో వసంతాన్ని తలపిస్తూ ఉంటాయి. వందేళ్ళ జీవితానుభూతుల్ని చవిచూసిన పండు వృద్ధులయినా, విద్యాసాగర సంచితాన్ని ఔపాసన పట్టిన పండిత మహాశయులయినా, సందిగ్ధంలో సద్వివేకాన్ని, సద్వర్తనుల్ని సంప్రదించి సరైన సమయంలో జీవితాన్ని అతలాకుతలం చేసే అల్లకల్లోలాల అలల మధ్య నుండి బయట పడేయగల నిర్ణయాలు తిసుకునే స్ఫూర్తి, సమయస్ఫూర్తిగా గల సామాన్యులైనా తమకు ప్రాప్తమయిన ఈ శుభ ఘడియల్లో తనివితీరా ఓలలాడేందుకు పరితపిస్తూ కనబడతారు. తూనిగల్లా ఝుమ్మని బైకులేసుకు తిరిగే కుర్రాళ్లలో, రంగు రంగుల దుస్తుల్లో భువన తారకల్లా మెరిపోతూ, పారిజాతాల్లాంటి పవిత్ర దరహాసంతో తేనెలొలుకు పలుకులతో తుళ్లుతూ వీధుల నిండా విహరించే చిన్నారి బాలబాలకల్లో ఒకే స్థాయి భక్తిభావాలు తొణికిసలాడుతూ దర్శనమిస్తాయి. అయిదు పూటల నమాజు సలపడం మానేసి, బజార్లలో బాతాఖానీలో **'మాటల మాంత్రికుల** నిపించుకునే 'సరదా సాహెబులు', సారాయి రాయుళ్ళు సయితం బుద్ధిగా ప్రార్థనల్లో పాల్గొంటూ తారసపడతారు. తలను నున్నగా దువ్వుకుని సాదాసీదా బట్టలెసుకుని వీపుకి పుస్తకాల బ్యాగు తగిలించుకుని, అటూ ఇటూ దిక్కులు చూడకు ండా రోడ్డు మీద ఎక్కడా ఆగి పెత్తనాలు చేయకుండా నేరుగా పాఠశాలకు వెళ్ళే చిన్నారి విద్యార్థులు సయితం రోజా వ్రతం పాటిస్తూ ముచ్చటే స్తారు. ఎముకలుడిగిన వయసుతతో బక్కచిక్కిన ముసలివారు సయితం ఎంతో నిష్ఠగా ఉపవాసాలు పాటిస్తూ పరవశించిపోవడం ఒక రమజాను మాసంలోనే కనబడుతుంది. ఇలా రకరకలా సుభక్త జనాలతో హరివిల్లులోని రంగులన్నీ ఒకే చోట అలరారుతున్నట్లుంటుంది వరాల వసంతం రమజాను మాసం.

సమాజ హితానికి, సంఘ క్షేమానికి, వ్యక్తి సంపూర్ణతకి కావలసిన, భక్తిభావనల్ని, ప్రేమాభిమానాన్ని, నమ్మకాన్ని, వ్యక్తావ్యక్త స్వేచ్ఛని, అనురాగాన్ని, అనుబంధాన్ని, త్యాగాన్ని, పరస్పర సహకారాన్ని, సుహృద్భావాన్ని రమజాను మాసం మనలో జనింప జేస్తుంది. ఏదైనా కానీ, ఏమైనా కానీ మరణం దాకా ప్రార్థించడమే మానవ జీవితానికి అర్థం. దైవప్రేమ తోడుంటే కుత్సిత మతులు ఎన్ని కుయుక్తులు పన్నినా ధర్మోన్నతి కోసం పాటు పడటమే పరమార్థం. ప్రార్థించడం అంటే అనుకున్నంత తేలికయిన విషయం కాదు! మనల్ని మనం దైవానికి పూర్తిగా అర్పించుకోనిదే అది సాధ్యం కాదు. అనునిత్యం మనం హృదయాన్ని దైవ ప్రేమతో వెలిగించే ఉంచాలి. మిథ్యా ఆలోచనలకు తావియ్యకూడదు.

అటు అలజడి, ఇటు అలజడి. ఎటు అడుగిడితే అటు కోర్కెల అలికిడి, కాంక్షల పుప్పొడి, తనువు అనువణువు భావ తలంపుల ముళ్ళ తక్కిడి. మెదడులో నీచ నిప్పు కణికల రాపిడి. మనస్సులో తమస్సు తాండవపు సడి. దైవాన్ని మనల్ని పూర్తిగా అర్పించుకోవడం అంత సులభం కాదదని తెలుస్తూనే ఉంది. అందుకనే జడివానలాంటి కన్నీటి తడితో మన మనో మాలిన్యాల్ని కడుక్కోవాలి. దైవ మహిమ ఏమిటో, ఆయన గుణవిశేషాలేమిటో, ఆయన శక్తీసామర్థ్యాలు ఏమిటో తెలిసిన వారికే **'స్వయంగా ఆయన్నే చూస్తున్నామన్నంత తన్మయంతో ప్రార్థించడం చేత నవుతుంద'**ని తెలిసిన మనం నిత్యం మారుతుండాలి. మన ప్రవర్తనలో పరివర్తనకై పరితపిస్తూ ఉండాలి. ఉదయం సాయంత్రం దైవకీర్తనలో ఊయలూగాలి మన హృదయం. పొద్దుపై దైవ స్తుతి గీతికలు లిఖిస్తూ ప్రకాశించే ఉదయభానుడు, పగలూరేయీ ప్రతి క్షణం అల్లాహ్‌ను ప్రశంసిస్తూ మీరు+నేను=మనం.

మనం ఎప్పుడూ ఇలానే ఉండాలి. పూలలో పరిమళాలై దాగుండాలి. మన ఈ విధేయత అవిధేయతగా రూపు దాల్చకూడదు. మనలో పొంగిపొర్లే భక్తిభావ తరంగాలు భుక్తి సహిత సుడిగుండాలవ్వకూడదు. మనసు మనకు చెప్పకనే త్రోవ తప్పుతుందేమో జాగ్రత్తగా మెలకువమై ఉందాం మనం!



– శాంతి ప్రియ

స్వర్గధామం

"మరి ఎవరయితే తన ప్రభువు ముందు నిలబడవలసి ఉంటుందని భయపడి తన మనసుని దుష్ట వాంఛలకు దూరంగా ఉంచాడో అతని నివాసం స్వర్గం అవుతుంది. అతను దానిలో సదా ఉంటాడు". (నాజిఆత్: 40,41)

"నిజం - ఎవరయితే నరకాగ్ని నుండి కాపాడ బడి, స్వర్గంలో ప్రవేశం కల్పించబడ్డారో వారే అసలు సిసలయిన విజేతలు". (ఆల్ ఇమ్రాన్: 185)

కాలం నిర్విఘ్నంగా ముందుకు దూసుకుపోతూ ఉంది. ప్రతి వ్యక్తి జీవన యాత్ర చేస్తూ గమ్యం వైపునకు సాగిపోతున్నాడు. ప్రతి ఒక్కరూ ఒక లక్ష్యాన్ని ముందు పెట్టుకుని, దాన్ని ఛేదించే దిశలో దూసుకుపోతున్నారు. కాని ఈ లక్ష్య సాధనలో అందరూ సఫలీకృతులు కాలేరు. ఎందరో అలసిసొలసి విఫలురై పోతారు. అయితే అల్లాహ్ ప్రీతిని పొందే ఉద్దేశ్యంతో ముందుకు సాగే వ్యక్తి శ్రమ ఎన్నటికీ వృధా కాదు. అలాంటి వ్యక్తి నోట సదా ఈ వేడుకోలు వచనం జాలువారుతూ ఉంటుంది – **"ఓ మా ప్రభూ! ఇహలోకంలోనూ, పరలోకంలోనూ మాకు మంచిని ప్రసా దించు. నరకాగ్ని నుండి మమ్మల్ని కాపాడు".** (బఖరా: 201)

అతని కోసం సృష్టిలోని సకల జీవరాసులు దుఆ చేస్తాయి. ఈ దుఆలు మరియు జనుల, దైవ దూతల దీవెనలు స్వర్గ రూపంలో ప్రతిఫలిస్తాయి. ఇంతకీ ఎవడా అదృష్టవంతుడు? ఈ మహా భాగ్యం ఎవరి ఖాతాలో చేరుతుంది?

అతడు – పడుకునేటప్పుడు వుజూ చేసుకొని నిద్రపోయాడు. **'అస్స లాతు ఖైరుమ్మినన్‌నౌమ్ - నిద్రకన్నా నమాజు మేలయినది'** అన్న ముఅజ్జిన్ పిలుపు చెవిలో పడగానే సుఖ నిద్రను పరిత్యజించి లేచి వుజూ చేసుకున్నాడు. నమాజు కోసం బయలుదేరాడు. భక్తిప్రపత్తులతో నమాజు చేశాడు. అల్లాహ్‌ను ఎంతో తాదాత్మ్యంతో స్మరించాడు. ఆ భక్తిపరుడు ఎన్నో పనులతో తలమునకలయి ఉన్నాడు. కానీ, **'హయ్యా అలస్సలాహ్ -నమాజు వైపునకు రండి!** అన్న పిలుపు వినబడింది. అల్లాహ్ విధిని నిర్వర్తించడానికి సకల పనులను ప్రక్కన పెట్ట మస్జిద్ వైపు నడవనారంభించాడు.

శుక్రవారం నాడు తన షాపు ముందు చాలా మంది కష్టమర్లున్నారు. వ్యాపారం మంచి ఊపు మీద ఉంది. అంతలోనే **'హయ్యా అలల్ ఫలాహ్ - సాఫల్యం వైపునకు రండి!'** అన్న నినాదం కర్ణపుటాలకు తాకింది. తక్షణమే అతనికి అల్లాహ్ చేసిన హితువు గుర్తుకొచ్చింది– **"ఓ విశ్వసించినవారలారా! శుక్రవారం నాడు నమాజుకై పిలిచిన ప్పుడు అల్లాహ్ సంస్మరణ వైపునకు పరుగెత్తండి. క్రయావిక్రయాలను వదిలి పెట్టండి...నిజంగా వినోదక్రీడలకంటే, వ్యాపారంకంటే అల్లాహ్ వద్ద ఉన్నదే శ్రేష్ఠమయినది. అల్లాహ్ అందరికంటే మేలయిన ఉపాధిప్రదాత".** (జుమా: 9) అంతే, షాపు మూసేసి మస్జిద్ వైపు జుమా నమాజు కోసం సాగిపోయాడు.

ఆ సత్యప్రియుడు గదిలో కొందరు స్నేహితులతో కూర్చొని ఉన్నాడు. ఏదో విషయమయి గొప్ప చర్చ జరుగుతోంది. ఉన్నట్టుండి వ్యర్థ ప్రలాపనలు, అశ్లీల పరాచికాలు మొదలయ్యాయి. అంతే. అతను వెంటనే దైవాగ్రహానికి కారణభూతమయ్యే ఆ స్థలానికి, అట్టి స్నేహానికి స్వస్తి పలికాడు. ఆ సద్వర్తనుడు చాడీలు చెప్పి, తమ సాటి సోదరుని మృత కళేబరాన్ని భక్షించే వారి సమావేశాల్లోకి వెళ్లడుగాక వెళ్లడు. ఒకరి వీపు వెనకాల మాట్లాడటం, ఎదుటివారిలో చిచ్చు పెట్టి వేడుక చూడటం అతని బొత్తిగా నచ్చదు. ఆ పుణ్యాత్ముడు పలికితే సత్యమే పలుకుతాడు. దైవాదేశాలకు, దైవప్రవక్త (స) నియమావళికి లోబడి జీవిస్తాడు. రమజాను ఉపవాసాలుంటాడు. జకాత్‌ను విధిగా చెల్లిస్తాడు. విరివిరిగా దానధర్మాలు చేస్తాడు. అనాథలకు ఆశ్రయం ఇస్తాడు. నిరు పేదలు, వితంతువులు, వికలాంగుల బాగోగులను గమనిస్తాడు. ఇరుగు పొరుగు వారి శ్రేయాన్ని కోరుతాడు, తల్లిదండ్రులను సేవిస్తాడు. పగవారితో సయితం ప్రేమగా వ్యవహరిస్తాడు. సంతానానికి సరైన సంస్కారాన్ని నేర్పుతాడు. భార్యతో ఉదారంగా వ్యవహరిస్తాడు. చిన్న చీమ మొదలు స్వర చేప వరకూ ప్రతి జీవి క్షేమాన్ని మనసారా కాంక్షిస్తాడు. అందరి లాగే అతనికీ మరణం సంభవించింది.

దైవ సన్నిధి

ఆ దాసుడు అల్లాహ్ ముందు నిలబడి ఉన్నాడు. అల్లాహ్ అతన్నుద్దేశించి: **'ఓ నా దాసుడా! నీ వల్ల జరిగిన ఫలానా పాపాన్ని గుర్తుచేసుకో'** అంటాడు. దాసుడు గుర్తు చేసుకుం టాడు. 'ఓ నా ప్రభూ!నేను సర్వ నాశనమయి పోయాను' అని మొరపెట్టుకుం టాడు. దానికి అల్లాహ్: **'నువ్వు ఈ పాపంపై పశ్చాత్తాపం చెందావు గనక ప్రపంచ జీవితంలో నీ ఈ పాపాన్ని పరుల నుండి కప్పిపుచ్చాను. నువ్వు నన్నే నుమ్ముకున్నావు గనక ఈ రోజు నిన్ను క్షమిస్తున్నాను'** అంటాడు. ఇక ఆ దాసుని ఆనందానికి మేరే ఉండదు.

మిత్రులారా! మనలో పాపం చేయని వారు ఎవరు? అయితే పాపం చేసి పశ్చాత్తాపం చెందిన వారే ధన్యులు. నిజ దైవ దాసుల లక్షణం కూడా అదే – **"వారు కలిమిలోనూ, లేమిలోనూ (దైవమార్గంలో) ఖర్చు చేస్తారు. కోపాన్ని దిగమ్రింగుతారు, ప్రజల పట్ల మన్నింపుల వైఖరిని అవలంబిస్తారు. అలాంటి సదాచార సంపన్నులనే అల్లాహ్ ప్రేమిస్తాడు. మరియు వారు తమ ద్వారా ఏదయినా నీతిబాహ్యమయిన పని జరిగి పోతే లేదా తమ ఆత్మలకు వారు ఏదయినా అన్యాయం చేసుకుంటే వెంటనే అల్లాహ్‌ను తలచుకుని, తమ పాపాల క్షమాపణకై వేడుకుంటారు. నిజానికి అల్లాహ్ తప్ప పాపాలను క్షమించేవాడెవడున్నాడు? - వారు తమ వల్ల జరిగింది తప్పు అని తెలిసినప్పుడు దానిపై హఠం చెయ్యరు".**

(ఆలి ఇమ్రాన్: 134-135)

"వారికే తమ ప్రభువు తరపు నుంచి క్షమాభిక్ష, క్రింద కాలువలు ప్రవహించే స్వర్గవనాలు ప్రతిఫలంగా లభిస్తుంది...ఈసత్కార్యాలు చేసేవారికి లభించే పుణ్యఫలం ఎంత చక్కనిది!".

(ఆలి ఇమ్రాన్: 136)

దాసుడి లెక్కల పత్రం అతని కుడి చేతికి ఇవ్వబడింది. వెంటనే తన వారి వైపునకు పరుగులు తీశాడు. ఈ రోజు అతని ఆనందానికి అవధులు లేవు. సంతోషంతో అతని ముఖం అరవిందంలా విప్పారింది. తన ప్రగతి పత్రాన్ని అందరి ముందూ ప్రదర్శిస్తూ – 'ఇదిగో,చూడండి! నా కర్మల పత్రాన్ని. మీరు చదవండి....నా కర్మలకుగాను మంచి ప్రతిఫలం లభిస్తుందని నేను అనుకుంటూ ఉండేవాడను. ఓ మహోన్నత వైభవంలో ప్రోగయి ఉన్న ప్రజలారా! చూడండి! నా కర్మల పత్రం నా కుడి చేతిలో ఇవ్వబడింది. ఏం చూస్తున్నారు? ఇది నమాజు! ఇది అన్నదానం! అదేమో ఉపవాసాలు! అవేమో హజ్జ్ ఉమ్రాలు, దుఆ,జిహాద్‌లు – ఇవన్నీ పుణ్యాలే. మీకు కానరావడం లేదా? నిశ్చయంగా నా ఈ కర్మల పత్రంలో పశ్చాత్తాపం – తౌబా ఉంది, క్షమాభిక్ష – ఇస్తిగ్ఫార్ ఉంది. దేవుని స్తుతిస్తోత్రాలు, పవిత్రతా కీర్తనలు – తస్బీహ్, తహ్మీద్, తహ్లీల్ కూడాఉన్నాయి. అల్లాహ్ వైపుకు ఆయన దాసుల్ని సాదరంగా ఆహ్వానించడం, ధర్మాన్ని, ఖుర్‌ఆన్‌ని నేర్చుకొని ఇతరులకు నేర్పించడమూ ఉంది. బాగా చూడండి! ఇది ఫజ్ర్, జుహ్ర్, అస్ర్, మగ్రిబ్, ఇషా నమాజు. అదేమో తహజ్జుద్, ఇష్రాఖ్, ఇస్తిఖారా, ఇస్తిస్ఖా, తసీబీహ్ నమాజు. నేను మహా ప్రవక్త ముహమ్మద్ (స) వారి వచనాన్ని ఇహలోకంలోనే గ్రహించాను **'ఖుర్‌ఆన్‌ను నేర్చుకొని ఇతరులకు నేర్పేవాడు మీలో ఉత్తముడు'** అని. (బుఖారీ)

'మరెవరయితే తమ ప్రభువుకు భయపడేవారో వారిని బృందాలు బృందాలుగా స్వర్గం వైపునకు తీసుకుపోవడం జరుగుతుంది".(జుమర్:73) ఈ సౌభాగ్యవంతులు స్వర్గం వైపునకు తీసుకుపోబడతారు. అక్కడికెళ్ళి అందరూ ఎదురు చూస్తున్నారు. ఏమయింది? ఈ ఎదురు చూపులు ఎవరి కోసం? అవునవును....వారు తమ ప్రియ ప్రవక్త ముహమ్మద్ (స) కోసం వేచి ఉన్నారు. మనుషుల్లో మహామనీషి! ప్రవక్తలందరిలో అగ్రజులు!! విశ్వ కారుణ్యమూర్తి! మానవ మహోపకారి!! దివ్యతేజస్సుతో కాంతులీనుతూ దేదీప్యమానమయిన ముఖారవిందంతో ప్రజల ముందు ప్రత్యక్షమవుతారు. అప్పుడు అందరూ మహా ప్రవక్త ముహమ్మద్ (స)తో కలిసి స్వర్గం తలుపుల దిశగా అడుగులు వేస్తారు.

స్వర్గం – స్వర్గానికి ఎనిమిది ద్వారాలు. స్వర్గాన్ని స్వయంగా అల్లాహ్, ప్రియమైన దాసుల కోసం తన స్వహస్తాలతో అలంకరించాడు. స్వర్గంలో ఒక బాణం పెట్టుకునేంత చోటు లభించినా అది ప్రాపంచిక సకల సంపదలకంటే ఎంతో ఘనతరమయినది. అందులో మొదట ప్రవేశించే అదృష్ట సముదాయం మహా ప్రవక్త ముమహమ్మద్ (స) వారి సముదాయం.

ఇదిగో! మహా ప్రవక్త ముహమ్మద్ (స) అడుగు ముందుకు వేశారు. స్వర్గం తలుపు తడుతున్నారు. **'ఎవరు మీరు?'** స్వర్గదూతలు ప్రశ్నించారు. **"నేను...ముహమ్మద్‌ని (స)".**

'ఓ ప్రవక్తా! మీ గురించి మాకు ఆజ్ఞాపించబడింది'.

'ఏమని?'

'మీరు వచ్చే వరకూ స్వర్గ ద్వారాలు తెరవకూడదని'. అల్లాహు అక్బర్! స్వర్గ ద్వారాలు తెరవబడ్డాయి. **"వారు అక్కడకు చేరుకునేటప్పుడికే దాని ద్వారాలు తెరవబడి ఉంటాయి. స్వర్గ పర్యవేక్షకులు వారినుద్దేశించి, 'మీపై శాంతి కురియుగాక! - సలామున్ అలైకుమ్'. మీరు హాయిగా ఉండండి"** అని (సాదరంగా స్వాగతిస్తారు) అంటారు. (జుమర్: 73)

అది ఎలాంటి సన్నివేశం?! అందరి ముఖాలు దేదీప్యమానంగా వెలిగిపోతున్నాయి. వారు అనందాతిశయంతో అల్లాహ్ ఘనకీర్తిని చాటుతున్నారు. స్వర్గ నిర్వహణాధికారులు వారితో – **'మీరు భాగ్యవంతులయ్యారు. మీరు ఇహలోకంలో మంచిగా మసలుకున్నారు. అందుకే స్వర్గంలో ని సకల భోగభాగ్యాలను అనుభవించేందుకు అందులో ప్రవేశించండి. "అక్కడ దయాసాగరుడయిన అల్లాహ్ తరపు నుండి వీరికి 'సలామ్' చెప్పబడుతుంది'.** (యాసీన్:58)

ఎంత అదృష్టం! మరెంత భాగ్యం!!

స్వర్గద్వారాల వద్ద నిలబడి దైవదూతలు పిలుపునిస్తున్నారు: 'క్రమం తప్పకుండా నమాజు చేసినవారలారా! రండి, 'బాబుస్సలాత్ – నమాజు ద్వారం' గుండా స్వర్గంలో ప్రవేశించండి. నిష్ఠగా ఉపవాసం పాటించే వారలారా! మీ కోసం బాబుర్రయ్యాన్ సిద్ధంగా ఉంది. నిజాయితీగా జకాతు చెల్లించే వారలారా! మీరు బాబుజ్జకాత్ ద్వారా స్వర్గంలో ప్రవేశించండి. పుణ్యఫలాపేక్షతో దానధర్మాలు చేసినవారలారా! మీ కోసం బాబుస్సదఖా ఉంది. ప్రాణాలొడ్డి దైవ మార్గంలో పోరాడిన ఓ జిహాద్ యోధులారా! దేవుడ స్వయంగా ఈ బాబుల్ జిహాద్‌ను తయారుచేశాడు రండి. కొందరు భాగ్యవంతుల్ని రెండేసి ద్వారాల గుండా పిలుపునివ్వడం జరుగుతుంది. మరికొంత మంది అదృష్టవంతుల్ని మూడు ద్వారాల గుండా, ఇంకొందరిని నాలుగు ద్వారాల గుండా పిలవడం జరుగుతుంది. వారిలో మరీ అదృష్టవంతులుంటారు. వారిని స్వర్గపు అన్నీ ద్వారాల గుండా స్వాగతించడం జరుగుతుంది. అల్లాహ్‌ను తన ప్రభువుగా, ముహమ్మద్ (స)ను తన ప్రవక్తగా నమ్మి, అయిదు పూటల నమాజు చేసి, రమజాను ఉపవాసాలు ఉండి, జకాత్ చెల్లించి, హజ్జ్ చేసి, తన భర్తతో మంచిగా నడుచుకున్న మహిళామూర్తులు కూడా ఈ జాబితాలో చేరతారు అని మహా ప్రవక్త ముహ్మద్ (స) వారే స్వయంగా సెలవిచ్చారు. వారికి నచ్చిన ద్వారం గుండా వారు స్వర్గంలో ప్రవేశించవచ్చు. సుబ్హానల్లాహ్!

సోదరా, సోదరీ! స్వర్గపు ఒక్కో ద్వారం వెడల్పు ఎంత ఉంటుందనుకుంటున్నావు? నలభై సంవత్సరాలు ఆగకుండా నడిచినా తరగనిదంత! ఇక్కడో విచిత్రం ఉంది. అదేమిటంటే – ఆ రోజు ఆ ద్వారాలే స్వర్గవాసులతో కిటకిటలాడుతుంటాయి. అల్లాహు అక్బర్!

సోదరా, సోదరీ! ఆలోచించు! నీవు స్వర్గవాసివన్న శుభవార్త ఇవ్వబడింది. దైవకృపతో నువ్వు పుల్‌సిరాత్‌ను దాటుకొని ఖన్తర అనే ప్రదేశానికి చేరుకున్నావు. నీలోని కల్మషాన్ని, కల్లాకపటాన్ని పూర్తిగా తీసివేయడం జరిగింది. ఆనక నువ్వు స్వర్గపు తలుపుల దగ్గరకు వచ్చావు. **'బిస్మిల్లాహ్'** అంటూ నీ కుడి పాదాన్ని స్వర్గంలో మోపావు. ఏం కనబడుతోంది? అక్కడ నువ్వు ఎటు చూసినా దైవానుగ్రహాలే. 'ఒక మహత్త సామ్రాజ్య వైభవం అక్కడ నీకు కనబడుతుంది'.ఒకేఒక్క అడుగు – దాసుడు ప్రపంచపు సకల బాధలను, దుఃఖాలను మరచిపోతాడు. అసలు ఇహలోకమన్నదే అతనికి జ్ఞప్తికి రాదు. నమాజు అలసట ఎటెళ్ళింది? జిహాద్ అలసట ఎటు మాయమయింది? భార్యాబిడ్డల, తల్లిదండ్రుల కోసం ధర్మసమ్మతమయిన సంపాదన కావాలని పడిన శ్రమంతా ఏమయింది? అన్నీ పోయాయి..మిగిలిందొకటే...అది అతని అదృష్టం! ఒక్క పాదమే కదా మోపింది! ఇంతలోనే అంత మహిమ.మరి ఇప్పుడతను రెండో పాదం మోపుతున్నాడు. ఎలా ఉంది స్వర్గం?.....–

మీకు తెలుసుకొనాలని ఉంది కదూ!! అయితే వచ్చే సంచిక వరకూ వేచి ఉండాల్సిందే సుమీ!!!



షేక్ యజ్దాన్

కువైట్ ఆకర్షణా కేంద్రాలు

విజ్ఞాన కేంద్రము
《The Scinctific Centre》

ఈ విజ్ఞాన కేంద్రం సముద్ర తీరాన ఒక పెద్ద భవనములో ఏర్పాటు చేయబడినది. ఈ భవనము నిర్మాణం ఇస్లామీయ కళా సంస్కృతికి అనుగుణంగా నిర్మించబడింది. ఇందులో ముఖ్యంగా మూడు భాగాలున్నాయి. ప్రదర్శనా శాల, డిస్కవరీ ప్లేస్, ఐమాక్స్ సినిమా, పరిశోదనా భవనము ప్రదర్శనాశాలలో సందర్శకులకు ఎడారి, సముద్రము మరియు తీరప్రాతంలో ఉన్న అనుభూతి కలుగుతుంది. ఇక్కడ వివిధ రకాలైన ప్రాణులను సహజ వాతావరణంలో వీక్షించగలము. పరిశోధన భవనములో విజ్ఞాన అనుభవమునూఎన్నో విద్యాపర మైన క్రీడలు పొందవచ్చు. ఐమాక్స్ సినిమాలో మీరు 3డి చిత్రాలను వీక్షించ గలరు. ఇందులో విద్యా విజ్ఞానానికి సంబం ధించిన డాక్యుమెం టరీ చిత్రాలను ప్రదర్శిం చడం జరుగుతుంది. ఇక్కడున్న మూడు కేంద్రాలు జీవిత కాలపు అనుభూతిని కలిగి స్తాయి.

స్థలం: రాస్ అల్ సాల్మియా ప్రాంతంలో సముద్ర తీరాన

సంప్రదించుటకు: 1848888

అల్ షాబ్ విశ్రాంతి పార్కు
《Al Sha,ab Leisure Park》



అల్ షాబ్ పార్కు సముద్ర తీరంలో ఏర్పాటు చేయబడినది. ఈ పార్కులో అన్ని వయసుల వారికి కావలసిన వివిధ రకాల ఉల్లాసభరిత మైన క్రీడలు ఏర్పాటు చేయ బడినవి. ఇక్కడ ముఖ్యమైన బంగీ జంపింగ్ ఐస్ స్కేటింగ్ 《Ice Skating》 కుటుంబ సమేతంగా కాల క్షేపము కొరకు రుచికరమైన భోజనశాలలు న్నాయి. ఇక్కడ అన్ని వసతులు అంతర్జాతీయ స్థాయిలో ఏర్పాటు చేయబడి ఉన్నాయి.

సంప్రదించుటకు: 25613777, 1885000

తారిఖ్ రజబ్ రపదర్శనాశాల
《Tariq Rajab Museum》



1980 వ సంవత్సరంలో తారిక్ రజబ్ సంగ్రహించిన అమూల్యమైన వస్తువులను ప్రజల సందర్శనార్థం ఈ ప్రదర్శనాశాల ఏర్పాటు చేశారు. ఇందులో పురాతన బం గారు, వెండి నగలు, బ్రిటిష్ వారి వ్రాత పత్రులు, లోహం మరియు గ్లాస్ పరికరాలు, బ్రిటిష్ వారి వస్త్రాలు, సంగీతపు పరికరాలు కలవు. తారిక్ రజబ్ దాదాపు 30 వేల వస్తువు లను సంవత్సర కాలంలో భద్రపరచినారు. ఇందులో కేవలం 10వేల వస్తువులు మాత్రమే ప్రజల దర్శనము కొరకు మ్యూజియంలో ఉంచబడినాయి. ఈ ప్రదర్శనాశాల రెండు భాగాలుగా విభజించబడినది. ఎ విభాగం మరియు బి విభాగం. ప్రతి విభాగంలో ఎంతో విలువైన పురాతన 250 పూర్వ కాలం నాటి చేతి పని వస్తువులు ఉన్నాయి.

సంప్రదించుటకు: 25317358

టూరిస్టిక్ వనము
《Touristic Garden》



టూరిస్టిక్ వనము 87,000 చదరపు మీటర్ల వైశాల్యంలో ఉన్నది. ఈ వనము పూర్తిగా రంగురంగుల పూల మొక్కలతో, ఖర్జూరపు చెట్లు మరియు వివిధ రకాల మొక్కలతో ఎంతో శోభాయమానంగా ఉం టుంది. ఇక్కడ రోమనుల తరహాలో నిర్మిం చబడిన భవంతి కలదు. ఇందులో 2000 మంది కూర్చోగలరు. ఈ భవనము ఎల్ల ప్పుడూ పండుగలకు, పార్టీలకు సిద్ధంగా ఉంటుంది. సందర్శకులకు రుచికరమైన వంటలు లభించును. విశాల క్రీడా స్థల ములో పిల్లల కొరకు వివిధ రకాల క్రీడా ఏర్పాట్లు చేయబడినాయి. శెలవు దినాల్లో తప్ప మిగతా అన్ని దినములు ప్రవేశ రుసుము లేదు. ప్రవేశ వేళలు వేసవిలో: 4పియం నుండి 12 పియం వరకు

శీతాకాలము: 3పియం నుండి 10:30 పియం.

సంప్రదించుటకు: 22428394

స్థలము: జిలైబ్ అల్ షువైఖ్ ప్రాంతము.

(సమాప్తం)

షేఖ్ అబ్దుల్ హఖ్
(పొరుమామిళ్ళ)

మృదువుగా సలహా ఇవ్వాలి

'ఎవరయితే ఇతరుల తప్పులను క్షమిస్తారో అల్లాహ్ వారి తప్పులను క్షమిస్తాడు' అని మానవ మహోపకారి ముహమ్మద్ (స) వారు సెలవిచ్చారు. మనం బజార్లలో తిరుగుతూ ఉంటాము. చెత్తాచెదారం చుట్టప్రక్కల పేరుకొని ఉంటుంది. అలాంటప్పుడు మనం ఒకటి రెండు ముల్లులయితే తీసేస్తాము. అధికంగా ఉంటే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయడం ద్వారా తెలియజేస్తాం. అంతేకాని చెత్తను అధికంగా వ్యాపింపజేయలేం కదా! అలాగే మనం ఇతరులతో ఏవైనా లోపాలుంటే వారి మనసు గాయపడకుండా సర్ది చెప్పి, వారిని మార్చడానికి ప్రయత్నిస్తాం. అంతేగాని అందరితో చెప్పి పరువు తియ్యం కదా! ఒక వేళ మనం చెప్పినా వినకపోతే అతని విజ్ఞతకే వదిలి వేస్తాం.

హజ్రత్ ఉమర్ ఫారూక్ (ర) ప్రజల స్థితిగతులను తెలుసుకునేందుకు రాత్రిళ్ళు గస్తీ తిరుగుతుంటారు. ఆయన వెంట అబ్దుల్లా అనే అనుచరుడు కూడా ఉన్నాడు. వీరికి ఒక ఇంటిలో నుంచి వెలుతురు కనబడింది. హజ్రత్ ఉమర్ (ర) ఆ ఇంటిలోకి ప్రవేశించి చూడగా ఒక వృద్ధుడు మద్యం సేవిస్తూ కనబడ్డాడు. వెంటనే ఆయన ఆగ్రహోదగ్రుడయ్యారు. **'ఈ వయసులో మద్యం సేవించడానికి నీకు సిగ్గుగా లేదు?'** అని నిలదీశారు. అప్పుడా వృద్ధుడు 'మీరు రెండు తప్పులు చేశారు. ఒకటి – నా ఇంట్లో నా అనుమతి లేకుండా ప్రవేశించారు. రెండోది – పనికట్టుకొని నా లోపాలను వెతుకుతున్నారు' అన్నాడు. ఈ మాటలు విన్న హజ్రత్ ఉమర్ (ర) వెంటనే తిరిగి వచ్చేశారు. కొంత కాలం తర్వాత ఆ వృద్ధుడు హజ్రత్ ఉమర్ గారి సభలో కూర్చొని ఉన్నాడు. ఉమర్ (ర) పిలిచారు. వృద్ధుడు శిక్షిస్తారేమోనని భయపడ్డాడు. అప్పుడు ఉమర్ (ర) వృద్ధునితో **'నేను నీ తప్పుని ఎవరితోనూ చెప్పలేదు. కనీసం నా వెంట ఉన్న అబ్దుల్లాతో కూడా!'** అన్నారు. అప్పుడా వృద్ధుడు **'నేను కూడా మద్యం సేవించడం మానేస్తున్నాను. అందుకు మీరే సాక్షి'** అన్నాడు.

ఇలా మనం చెప్పేది సమసరస భావంతో సలహా ఇస్తే ఎంతటి కఠినుడైనా ఇన్షా అల్లాహ్ తప్పక మారగలడు. అలాగే అద్దం అందరినీ ప్రతిబింబిస్తుంది. కాని అది ఒకరి లోపాలను మరొకరికి నివేదించదు. అందరి రహస్యాలను తనలో దాచుకుంటుంది. ఎవరి లోపాలైనా చెప్పినప్పుడు అతను కోపంతో ఒకవేళ దాన్ని పగులగొట్టినా ఆ ముక్కల్లోంచి చూస్తే మళ్ళీ అదే లోపం కనిపిస్తుం ది. అంతేగాని పగిలిపోయాను కదా అని అబద్ధం చెప్పదు. అదే విధంగా మనం కూడా ఎంతటి క్లిష్ట స్థితులు ఎదురైనా, ఎంతటి బాధలు పడాల్సి వచ్చినా, ఎన్ని కష్టాలు భరించాల్సి వచ్చినా మంచిని విడనాడకూడదు. వీలైనంత వరకూ సమాజంలో సంస్కరణలకు పునాది వేయాలే తప్ప మనకెందుకులే అని మన స్వార్థం మనం చూసుకోకూడదు. దైవం ప్రసాదించిన ఈ విలువైన శరీరాన్ని ఎంతో కొంత నిస్వార్థంగా జీవితం సాగించడంలోనే నిజమైన ఆనందం ఉంది. అందులోనే పరలోక సాఫల్యం ఉంది.

సయ్యిద్ హఫీజుల్లాహ్

షైతాన్ ఎత్తుగడలు

▶షైతాన్ ఎత్తుగడలు, కుట్రలు, పన్నాగాలు అనేకం. అతని ఇంద్రజాలం మరియు విష వలయాల్లో ఒకటి–మనిషికి సిరి సంపదలు ప్రాప్తమయితే అతనిలో వ్యతిరేక భావావేశాల్ని పురి గొల్పుతాడు. తత్కారణంగా అతను తన ఆస్తి అంతస్థులని చూసుకొని మిడిది పడుతూ మైమరచి ప్రవర్తిస్తాడు. దైవ దాసుల్ని చీడపురుగుల్లా భావించే అహం అనే మహమ్మారి వాతన పడతాడు. ఫలితంగా దైవాన్ని విస్మరించి ఇతర విషయాలపై మనసు లగ్నం చేస్తాడు.

▶సోమరితనం, బద్ధకం షైతాన్ గుణాలు. విశ్వాసులు కూడా వీటికి బానిస అవ్వాలని షైతాన్ అభిలషిస్తాడు.

▶బజారులో మొదటి వ్యక్తి ప్రవేశంతోపాటే షైతాన్ బృందాలు కూడా రంగురంగుల జెండాలతో ప్రవేశిస్తాయి. చివరికి వ్యక్తి బజారు నుండి వెలుపలికి రాగ అవీ బైటకొస్తాయి.

▶ఒంటరిగా ఉన్న వ్యక్తితో షైతాన్ ఉంటాడు. ఇద్దరైపోతే తను పారిపోతాడు.

▶షైతాన్ మీ వద్దకు వచ్చి, మిమ్మల్ని ఎవరు పుట్టించాడు? అని ప్రశ్నిస్తాడు. దానికి అల్లాహ్ అన్న సమాధానం ఇవ్వబడుతోంది. ఆ తరువాత మళ్ళి మిమ్మల్ని మీ పూర్వీకుల్ని పుట్టించింది ఎవరు? అని మళ్ళి ప్రశ్నిస్తాడు. అల్లాహ్ అని సమాధానం ఇవ్వబడుతోంది. చివరికి అల్లాహ్‌ను పుట్టించిందెవరు? అని అడుగుతాడు. ఈ విధమైనటువంటి పరిస్థితి ఏర్పడితే అప్పుడు–**'నేను అల్లాహ్‌ను మరియు దైవప్రవక్త (స)ను విశ్వసించాను'** అనండి. అంతే షైతాన్ మీ నుండి దూరంగా పారిపోతాడు.

▶షైతాన్ రక్తం ప్రవహించినట్లు మీ నరనరాల్లో ప్రవహిస్తుంటాడు.

▶ఒకరి పాపాల వల్ల అల్లాహ్ అతన్ని నాశనం చేయాలనుకుంటే, అతనిలో సిగ్గు లేకుండా చేస్తాడు. అతనిలో సిగ్గుబిడియాలు దూరమైన తరువాత అతనికి ప్రజలంటే విరక్తి కలుగుతోంది. ప్రజలు సయితం అతన్ని అసహ్యించుకుంటారు. ఈ పరిస్థితి గనక దాపురిస్తే 'అతని నుండి సచ్చీలత' గుణం కూడా దేవుడు తీసుకుంటాడు. అలా అతను నమ్మకద్రోహిగా మారిపోతాడు. అప్పుడు అతన్నుండి తన కరుణ కటాక్షాల్ని కూడా లాక్కుంటాడు. ఆ విధంగా అతను దైవం నుండి ధిక్కరించబడిన దౌర్భాగ్యుడవుతాడు. ఆ తరువాత అతన్నుండి **'ఇస్లాం'** శాంతి సుస్థిరతలను దూరం చేస్తాడు.

▶అహం, గర్వం అనేది 70 ఏండ్ల ఆరాధనను వృధా చేస్తుంది. కోపం, క్రోధం, తొందరపాటు షైతాన్ తరపు నుండి. షైతాన్ అగ్గితో సృజించబడ్డాడు. అగ్గిని జలం ఆర్పివేస్తుంది. కనుక మీకు కోపం వచ్చినప్పుడల్లా వుజూ చేసుకోండి అన్నారు ప్రవక్త ముహమ్మద్ (స).



(గత సంచిక తరువాయి భాగం)

ఆహారపానీయాలు ఆచార నియమాలు

జైన మతం

మంచి జైన్ అంటే తప్పనిసరిగా శాఖాహారి మాత్రమే అని, సృష్టిలో జీవమున్న ఏప్రాణికీ హాని కలిగించకూడదని అంటారు. ఈ కారణంగా కొంత మంది నడుస్తున్నప్పుడు దారిని శభ్ర పరచుకుంటూ వెళతారు. ఇంకా గాలిలో తేలుకూంటూ వచ్చి ఏ సన్న ప్రాణి అయినా శ్వాసలో చిక్కుబడి చనిపోతుందేమోనన్న చింతనతో(?) కొంత మంది ముక్కు మీద నోటి మీద వస్త్రం అడ్డంగా పెట్టుకుంటారు. అయితే వ్యవసాయంలోనూ, దేశ భద్రత కాపాడే విషయంలోనూ వీటికి మినహాయింపు ఇస్తారు.

ఒక ప్రాణి ఉనికి, ఆ ప్రాణికుంటే ఇంద్రియాల్ని బట్టి వర్గీకరిస్తారు. సృష్టిలో అతి సూక్ష్మ ప్రాణికి ఒకే ఒక్క ఇంద్రియం పని చేస్తుంది. అది స్పర్శ! ఈ వర్గీకరణ క్రిందికి వచ్చేవి మొక్కలు. సృష్టిలో అత్యున్నత ప్రాణి మనిషి. తర్వాత ఇతర జంతువులు. వీటికి అయిదు ఇంద్రియాలు – స్పర్శ, వాసన, రుచి,దృష్టి,వినికిడి–సమానంగా ఉంటాయి. కొన్ని ప్రాణులకు రెండు లేదా మూడు ఇంద్రియాలు మాత్రమే పని చేస్తాయి. ఉదాహరణకు: వాన పాముకి వాసన, రుచి అనే రెండు ఇంద్రియాలు మాత్రమే పని చేస్తాయి. పేలకి మూడు – స్పర్శ, రుచి, వాసన. దోమలకు నాలుగు – స్పర్శ, రుచి, వాసన, దృష్టి. మొక్కకి ఒకే ఒక్క ఇంద్రియం పని చేస్తుంది కాబట్టి దాన్ని ఆహారంగా తీసుకోవచ్చంటారు. అలాగే దుంపల్ని తినాలంటే ఒక మొక్కని వేళ్ళతో సహా పెకలించివేయాలి గనక, దాని వల్ల చుట్టు ప్రక్కల ఉన్న అనేక జీవాలు మరణిస్తాయి గనక దుంపల్ని తినరు.

పండు కూడా బాగా పండిన మీదటే తినాలంటారు. అంటే అది రాలిపోయే స్థితిలో ఉన్నప్పుడే దాన్ని తినాలన్న మాట. ఇంత తృణ ధాన్యాలు, గోధుమలు, వరి, చిక్కుళ్ళు మొదలైనవి బాగా ఎండిన మీదటే తియ్యాలి. కొందరయితే వంకాయ జామ పండులో కొన్ని పురుగులుంటాయని తినరు. క్యాలిఫ్లవర్, బ్రోకోలి లాంటి వాటిని కూడా వాడని వారున్నారు. పుట్ట గొడుగులు, క్యాబేజీ, ఇతర ఆకు కూరల్ని కూడా జైనులు వాడరు. అయితే పాల ఉత్పత్తుల్ని మాత్రం వాడతారు. అలాగే ఆహార పదార్థాలు పగలు మాత్రమే వండాలి. పగలు మాత్రమే తినాలి. అంటే వారికి రాత్రి భోజనం నిషిద్ధమే. రాత్రి పూట వండితే నిప్పుకి ఆకర్షితమయిన కొన్ని పురుగులు కాలి చచ్చిపోతాయన్నది వారి వాదన.

సాధారణంగా శాఖాహారమే సర్వ శ్రేష్ఠము అని బల్ల గుద్ది మరి చెప్పేవారి వాదన ఏమిటంటే, మొక్కలు, బాధల్ని, కష్టాల్ని అనుభవించవు గనక జంతువుల్ని సంపే కంటే, మొక్కల్ని చంపటం చిన్న నేరంగా పరగణించబడుతుందని. మొక్కలకు కూడా బాధ కలుగుతుందని నేటి ఆధునిక సైన్స్ తేటతెల్లం చేసింది. కాకపోతే వాటి బాధను, వాటి ఆలాపనను మనిషి వినలేడు, గ్రహించలేడు. దీనికి కారణం ఏమిటంటే మానవ కర్ణాలు 20 మొదలుకొని 20,000 హర్టజ్ ఫ్రిక్వెన్సీ మధ్యలో ఉండే శబ్ద తరంగాల్ని మాత్రమే వినగలుగుతాయి. అంటే 20 కన్నా తక్కువగానీ, లేక 20,000 కన్నా ఎక్కువ ఫ్రిక్వెన్సీల్లో ఉన్నవాటిని వినలేడు. ఈ పరిధి మానవుని యొక్క వినగలిగే హద్దు అనబడుతుంది.

ఒక శునకంలో 40,000 హర్టజ్ శబ్ద తరంగాలు వినగలిగే శక్తి ఉంటుంది. ఒక మౌనంగా ఉన్న కుక్కలో 20,000 హర్టజ్ కన్నా అధికంగా, 40,000 హర్టజ్ కన్నా తక్కువగా ఉన్న శబ్ద తరంగాల్ని వినగలిగే యోగ్యత ఉంటుంది. ఈ కారణంగానే ఒక కుక్క తన యజమాని వేసిన ప్రత్యేక ఈల శబ్దాన్ని సునాయాసంగా విని, పరుగెత్తుకుంటూ వస్తుంది. కాని ఆ ఈల శబ్దాన్ని ఇతర మనుషులు వినలేరు. అలాగే ఒక అమెరికన్ రైతు మొక్కలపై పరిశోధన చేసి, మొక్కల మొర యొక్క ఫ్రిక్వెన్సీని పెంచి, మనుషులకు వినపించేంత పరిధిలోకి తేగలిగిన ఒక పరికరాన్ని కనుగొన్నాడు. మొక్కలు నీరు కావాలని అరచినప్పుడు, వెంటనే అతనికి తెలిసిపోతుంది.

ఇక ఎవరయితే శాఖాహారాన్నే సమర్థిస్తూ, వృక్షాల్లో రెండు లేక మూడు ఇంద్రియాలే ఉంటాయని, దీనికి భిన్నంగా జంతువుల్లో ఐదు ఉంటాయని, కనుక మొక్కల్ని హత మార్చడం, పశువుల్ని హతమార్చడం కంటే చిన్న అపరాధమని వాదిస్తారో వారు తెలుసుకోవాల్సి వాస్తవం ఒకటుంది. వినడానికి వినసొంపుగా ఉన్న ఈ వాదన ఆచరణలో సాధ్యం కాదు. ఆలోచించడానికి ఒక ఉదాహరణ: ఒక వ్యక్తి పుట్టు గుడ్డి, అవిటి, చెవిటి, మూగ వాడయి ఉన్నాడు అనుకుందాం. అతని ఇతర సామాన్య మనుషుల కన్నా మూడు ఇంద్రియాలు తక్కువ కలిగి ఉన్నాడు కాబట్టి అతన్ని హత్య చేసిన వ్యక్తికి తక్కువ శిక్ష విధించాలని ఏ లాయరు అయినా వాదించగలడా? వాదించలేడు. దానికి బదులుగా, హంతకుడు ఒక నిర్దోషిని, అందులో గుడ్డి, చెవిటి, అవిటి, మూగ వ్యక్తిని హతమార్చాడని, ప్రతిగా హంతకుని

కి కఠినాతి కఠినమైన శిక్ష విధిం చాలని మాత్రమే ఒక లాయరుగాని, మనము గాని కోరుకుంటామాగా!!

ఈ ప్రపంచంలో ప్రతి మనిషి శాకహారిగా ఉంటే, పశువుల్లో సంతానోత్పత్తి అధికమ వ్వడం వల్ల పశువుల సంఖ్య గణనీయంగా పెరిగిపోయేది. కాబట్టే మహోన్నత యుక్తి పరుడనయిన అల్లాహ్ వాటి సంఖ్యను పరి మిత హద్దుల్లో ఉంచడానికి ఒక మార్గాన్ని సూచించాడు. అందుకని శాఖాహారాలతో పాటుగా మాంసాహారానికి అల్లాహ్ అను మతించాడంటే, అందులో ఆశ్చర్య పడా ల్సింది ఏమీ లేదు. కొందరు శాఖాహారాన్ని మాత్రమే తీసుకుంటూ ఉంటే వారిపై ఎలా ంటి ఆక్షేపణా లేదు. అయితే మాంసాహారు ల్ని, క్రూరులుగా భావించడం, మాంసాహా రాన్ని ఆధ్యాత్మిక వికాస మార్గంలో అవరో ధంగా తలంచడం, గర్హించడం, నిందించ డం సమాలోచనాపరుల లక్షణం కాదు. ఒక్క మాటలో చెప్పాలంటే ఆహారపానీయా లను మనకు అనుగ్రహించింది దేవుడే. కాబట్టి ధర్మం, అధర్మం అని ఖరారు చేసే హక్కు ఆయనకొక్కడికే ఉంటుంది.

తాతముత్తాతల సంప్రదాయాల, వ్యక్తులు ప్రవేశ పెట్టిన సిద్ధాంతాల ఆధారంగా ఎవ రికి వారుగా కొన్నింటిని హలాల్‌గా, మరి కొన్నింటిని హరామ్‌గా ఖరారు చేసుకోవ డం ఎంత మాత్రం సమంజసం కాదు. ఒకవేళ వారు చెబుతున్నది నిజమే అయితే వారి వద్ద ఏదయినా జ్ఞానం ఉన్నట్లయితే దాని ఆధారంగా ప్రమాణం చూపాల్సి ఉం టుంది. ఇది నాది అన్నంత మాత్రాన ఒక వస్తువు ఎలాగయితే మనది కాజాలదో అలాగే ఇది హరామ్ ఇది హలాల్ అని ఒకరు అన్నంత మాత్రాన అయిపోదు. దానికంటూ ఒక ఆధారం ఉండాలి.

సిక్కు మతం

హిందూ-ఇస్లాం మతాల లక్షణాలను ఉమ్మ డిగా పుణికి పుచ్చుకుని పుట్టిన మతమే సిక్కు మతం. 16వ శతాబ్దిలో ఉత్తర భారత దేశంలో గురునానక్ బోధనలు ఈ మతానికి పునాది. తర్వాత 9మంది గురు వులు ఈ మతం ఆలోచనా విధానాన్ని పెం పొందించారు. సిక్కులలో అత్యధిక శాతం జనాభా మన దేశంలోని పంజాబ్‌లోనే ఉంది. వీరిలో అధిక శాతం మాంసహారు లే.

వీరు మాంసాహారం తిసుకున్నాలనుకున్న ప్పుడు ముస్లింల మాదిరిగా హలాల్ పద్ధతిని పాటిస్తారు. సిక్కుల్లో ఏ గురువునూ మాం సాహారాన్ని ఖండించలేదు. శాఖాహారమే సర్వ శ్రేష్ఠమని వారు ఎన్నడూ, ఎక్కడా ప్రస్తావించలేదు. వీరిలో కొందరు గోవు మాంసాన్ని, పంది మాంసాన్ని నిషేధించుకు న్నారు.

జొరాస్ట్రియనిజం

ప్రాచీన పర్షియా (ఇరాన్)లో జొరాస్టర్ అనే వ్యక్తి స్థాపించిన మతం జొరాస్ట్రియనిజం. జొరాస్టర్ మితహారవాది అని, మరీ ఎగబడి తినడం, తినీ తిననట్టుగా తినడం-రెండిం టినీ అతను వద్దన్నాడంటారు. అయితే జొరాస్ట్రియన్లు అందరూ శాఖహారులు కారు.

జుడాయిజం

ఈనాడు యూదుల ప్రధాన ఆహారం మాసం. సామాన్యంగా జరుపుకునే 'సించా' లాంటి చిన్నపాటి పండగల్లో కూడా చికెన్ కేకులు, కాలేయంతో తయారు ఆహారపదా ర్థాలు తప్పనిసరిగా ఉంటాయి. ఒక దశలో వ్యవసాయ వ్యవస్థకు లోబడి కొంత కాలం మాంసాహారానికి దూరంగా ఉన్నారన్న మాట కూడా నిజమే. కాబట్టి యూదులు నేరుగా మాంసాహారాన్ని నిరాకరించలేదు గానీ, మాంసాహారాన్ని ఇతర పదార్థాలతో కలిపి తీసుకోవడాన్ని నిషేధించారు. ముఖ్యంగా పాలతో, రక్తంతో కలపకూడద న్నారు.**'మేక పిల్లను దాని తల్లిపాలతో వండకూడదు"** (ద్వితీయోపదేశ కాండము -14: 21)

యూద సంప్రదాయంలో కొన్ని జంతువు లు మాత్రమే ఆహారంగా తీసుకోదగినవి. పంది వంటివి నిషిద్ధం. గోవు, గొర్రెలు, మేకలు, మగ జింక మొదలైననాటి మాం సం తినవచ్చు. కొన్ని రకాల జంతువుల మాంసాన్ని తినకూడదు. 1) ఆరోగ్యానికి హానికరమయినవి. 2) యూదులకు తమ పవిత్ర వారసత్వానికి ప్రతీకలయినవి. యూదులు జంతువుని ఆహారంగా తీసు కునే ముందు 'కష్రూత్' అను క్రతువుని పాటిస్తారు.ఇది ముస్లింల పద్ధతిలో హలాల్ వంటిదే. మాంసంలోని రక్తాన్నంతా కడిగే ప్రక్రియ 'కొషర్'. దీన్ని యూదులు చాలా అవసరమైన ప్రక్రియగా భావిస్తారు.అయితే పై పేర్కొన్న వాటిలో కొన్ని ప్రామాణికమ యినవయినా, కొన్నింటికి ఎలాంటి ప్రామా ణికత లేదు.

ఉదాహరణకు: **'ఒంటె నెమరు వేయను గాని దానికి రెండు డెక్కలు లేవు గనక అది మీకు అపవిత్రము. పొట్టి కుందేలు నెమరు వేయనుగాని దాని కి రెండుడెక్కలు లేవు గనక అది మీకు అపవిత్రము. కుందేలు నెమరు వేయనుగాని దానికి రెండు డెక్కలు లేవు గనక అది మీకు అపవిత్రము'.** (లేవీయ కాండము- 11: 4-6)

'సమద్రములలోనేమి, నదులలోనేమి సమస్త జల చరములలోను సమస్త జల జంతువులలోనూ వేటికి రెక్కలు పాలుసులు ఉండవో అవన్నియు హేయములు'. (లేవీయ కాండము-11: 10)

'...క్రొంచ పక్షి....నల్ల పక్కులు.... నిప్పు కోడి.....కోకిల.....హంస...గూడ బాతు.... సంకుబుడి కొంగ, ప్రతి విధమయిన కొంగ, కుకుడు గువ్వ...పక్కులలో వీటి ని హేయములుగా ఎంచవలెను'.

(లేవీయ కాండము- 11: 13-19)

పై పేర్కొన్న వస్తువులు ప్రవక్త మూసా (అ) వారికి ఇవ్వబడిన తౌరాత్ (తొరా)లో హరామ్‌గా పేర్కొనడం జరుగలేదని ఖుర్ ఆన్‌లోని నిసా సూరా ద్వారా రూఢి అవు తుంది. ఇదే విషయమయి ఖుర్‌ఆన్ ఇలా ప్రశ్నిస్తుంది:

"(ముహమ్మద్ (స) తెచ్చిన ధర్మశాస్త్రంలో అనుమతించిన) ఈ భోజన పదార్థాలన్నీ బనీ ఇస్రాయీల్‌కు-కూడా అనుమతించిన వే. అయితే తౌరాత్ అవతరించడానికి పూర్వమే ఇస్రాయీల్ స్వయంగా తనకు నిషేధించుకున్న పదార్థాలుకొన్ని ఉండేవి. వీరికి చెప్పు ఒకవేళ మీరు (మీ అభ్యతరం లో) నిజాయితీ పరులయితే తౌరాత్‌ను తీసుకు రండి. దాని వచనం ఏదయినా చదివి వినిపించండి".(ఆల్ ఇమ్రాన్: 93)

ఈ ఆయతు దీని తర్వాతి రెండు ఆయ తులు యూదుల ఆంక్షేపణలకు సమాధా నంగా అవతరించాయి. ఇంతకీ ఆ ఆంక్షే పణ ఏమిటి? అంటే, కొంత మంది యూదులు మహా ప్రవక్త ముహమ్మద్ (స) వారినుద్దేశించి: "మీరు ఒకవైపు ఇబ్రా హీమ్ (అ) అనుయాయులం అని చెప్పు కుంటూనే మరోవైపు ఒంటె మాంసం తింటున్నారాయే. మరి చూడబోతే ఇబ్రా హీమ్ ధర్మశాస్త్రంలో ఒంటె మాంసం, ఒంటె పాలు నిషేధించబడ్డాయి" అన్నారు.



ఈ ప్రపంచంలో ప్రతి మనిషి శాకహారిగా ఉంటే, పశువుల్లో సంతానోత్పత్తి అధికమవ్వడం వల్ల పశువుల సంఖ్య గణనీయంగా పెరిగిపోయేది. కాబట్టే మహోన్నత యుక్తి పరుడనయిన అల్లాహ్ వాటి సంఖ్యను పరిమిత హద్దుల్లో ఉంచడానికి ఒక మార్గాన్ని సూచించాడు. అందుకని శాఖాహారాలతోపాటుగా మాంసాహారానికి అల్లాహ్ అనుమతించాడంటే, అందులో ఆశ్చర్య పడాల్సింది ఏమీ లేదు. కొందరు శాఖాహారాన్ని మాత్రమే తీసుకుంటూ ఉంటే వారిపై ఎలాంటి ఆక్షేపణా లేదు. అయితే మాంసాహారుల్ని క్రూరులుగా భావించడం, మాంసాహారాన్ని ఆధ్యాత్మిక వికాస మార్గంలో అవరోధంగా తలంచడం, గర్హించడం, నిందించడం సమాలోచనాపరుల లక్షణం కాదు. ఒక్క మాటలో చెప్పాలంటే ఆహారపానీయాలను మనకు అనుగ్రహించింది దేవుడే. కాబట్టి ధర్మం, అధర్మం అని ఖరారు చేసే హక్కు కూడా ఆయనకొక్కడికే ఉంటుంది.

దీనికి జవాబుగా అల్లాహ్ ఏమన్నాడంటే, యూదుల ఆరోపణ నిరాధారమయినది. ఇబ్రాహీమ్ (అ) వారి ధర్మశాస్త్రంలో ఈ రెండు వస్తువులు హరామ్ (నిషిద్ధం)గా లేవు. కాకపోతే ఇస్రాయీలు (యాఖూబ్) (అ) తనంతట తానుగా కొన్ని వస్తువులను తన కోసం మాత్రమే నిషేధించుకొన్నారు. ఆ వస్తువులే ఒంటె మాంసం, ఒంటెపాలు. (మొక్కుబడి మూలంగానో, అనారోగ్యం కారణంగానో ఆయన ఈ నిర్ణయానికి వచ్చారు అన్నది పండితుల మాట). పోతే యాఖూబ్ (అ) గారి ఈ నిర్ణయం కూడా తౌరాతు గ్రంథం అవతరించక పూర్వం జరిగింది. మరి తౌరాతు గ్రంథమేమో ఇబ్రాహీమ్, యాఖూబ్ (అ) చాలా కాలం తర్వాత వచ్చింది. మరలాంటప్పుడు మీరు ఇలాంటి అభ్యంతరాలను ఎలా లేవనెత్తుతున్నారు? మీకు అనుమానముంటే గ్రంథం తెచ్చి చదవండి – ఇబ్రాహీమ్ (అ) కాలంలో ఈ వస్తువులు నిషిద్ధంగా ఖరారు కాలేదన్న వాస్తవం మీకే అర్థమవుతుంది. అయినా యూదులు అప్పుడు తౌరాతు గ్రంథాన్ని తెచ్చి చదివే సాహసం చేయలేకపోయారంటే అర్థం, ఈ నిషేధాజ్ఞలు తర్వాతి కాలంలో చోటు చేసుకున్నాయన్న మాట. వాస్తవం ఏమిటంటే, నేటి యూదు ధర్మశాస్త్ర సంకలనం క్రీ.శ. రెండవ శతాబ్ది చివరన రిబ్బీ యెహూదా చేతి మీదుగా పూర్తయిందని చరిత్ర కూడా సాక్ష్యమిస్తుంది.

అలాగే యూదులు పాల్పడే కొన్ని దుర్మార్గాల, దురాగతాల కారణంగా కూడా అల్లాహ్ కొన్నింటిని వారిపై నిషేధించాడు: **"యూదుల దుర్మార్గం వల్ల వారికి ధర్మ సమ్మతంగా ఉన్న అనేక పరిశుద్ధ వస్తువులను మేము వారి కోసం నిషేధించాము. వారు ఎంతో మందిని అల్లాహ్ మార్గం నుండి అడ్డుకోవడం వల్లనూ, నిషేధించబడిన వడ్డీని పుచ్చుకోవడం వల్లనూ, జనుల సొమ్మును అన్యాయంగా స్వాహా చేయడం వల్లనూ (వారికి దుర్గతి పట్టింది)."** (అన్‌నిసా:160,161)

నిషేధించబడిన ఆ వస్తువులు ఏమిటి? అంటే, **"యూదులకు మేము గోళ్లు గల జంతువులన్నింటినీ (అంటే వ్రేళ్ళు చీలకుండా అతుక్కుపోయినవి–నిప్పుకోడి, ఒంటె, బాతు మొదలయిన వాటిని) నిషేధించాము. ఇంకా వారికి, ఆవు మరియు మేకలలో వాటి వీపులకు తగిలి ఉన్న కొవ్వునీ, ప్రేగులపై ఉన్న దానినీ, ఎముకలతో కలిసి ఉన్న దానిని తప్ప – మిగిలిన క్రొవ్వును కూడా నిషేధించాము. వారి తల బిరుసుతనం మూలంగా మేము వారికి ఈ శిక్ష విధించాము".** (అన్‌ఆమ్:146) అంటే, ప్రవక్త యాఖూబ్ (అ) ఈ వస్తువులను తమ కోసం నిషేధించినందు వల్ల, తాము కూడా ఆయన అనుయాయులుగా వాటిని నిషిద్ధంగా భావిస్తున్నామని వారు చెప్పేవన్నీ కల్లిబొల్లి కబుర్లే. ఈ శిక్ష సబ్బత్ దినాన్ని పోలినదే. అది అప్పటి షరీయతు వరకే పరిమితం.

ఇక్కడ విదితమయ్యే మరో విషయం ఏమిటంటే సాధారణంగా దేవుడు నిషేధించిన వస్తువులు మానవ శ్రేయాన్ని కోరే ఉంటాయి. అయితే కొందరి నిర్వాకానికి గాను నిషేధించే వస్తువులు అవి స్వతహాగా అంతకు పూర్వం హలాల్ పరిశుద్ధమయినవే అయినా వారిని శిక్షించే నిమిత్తం వాటిని నిషేధించడం జరుగుతుంది.

యూదులలో గల మరికొన్ని నియమాలు దిగ్భ్రాంతికి గురి చేస్తాయి. వాటిలో రెండిని ఇక్క ఇస్తున్నాము. "నీ సంతితి వారిలో ఒకనికి కళంకమేదైనను (పుట్టుకతో వచ్చే దేహ సంబంధిత లోపము) కలిగిన యెడలఅతడు తన దేవునికి ఆహారము అర్పించుటకు సమీపింకూడదు. ఏలయనగా ఎవనియందు కళంకము (దేహలోపం) ఉండునో వాడు గ్రుడ్డివాడేగాని, కుంటివాడేగాని, ముక్కిడి వాడేగాని, విపరీత (అదనపు) అవయములు గలవాడేగాని, గుజ్జువాడేగాని, గూనివాడేగాని, కంటిలో పువ్వు గలవాడేగాని, గజ్జి గల వాడే గాని, చిరు గుడు గలవాడేగాని, వృషణములు నలిగిన వాడేగాని సమీపింప కూడదు". (లేవీయ కాండము–21: 16–20) అంటే, పై పేర్కొనబడిన వారు దైవ సేవకు అనర్హులు అన్న మాట.

"అన్యుడు ప్రతిష్ఠితమైన దానిని తినకూడదు. యాజకుని ఇంట నివసించు అన్యుడేగాని, జీతగాడేగాని ప్రతిష్ఠితమైన దానిని తినకూడదు.....యాజకుని కుమార్తె అన్యునికియ్యబడిన యెడల ఆమె ప్రతిష్ఠితమైనవాటిలో ప్రతిష్ఠార్పణమును తినకూడదు.....ఒకడు పొరబాటున ప్రతిష్ఠితమైన దానిని తినిన యెడల వాడు ఆ ప్రతిష్ఠితమైన దానిలో అయిదవ వంతు కలిపి దానితో యాజకునికియ్యవలెను". (లేవీయకాండము-22: 10-15)

ఈ పై రెండు ఉదాహరణల వల్ల అర్థమయ్యేది ఏమిటంటే, అల్లాహ్ అవతరింపజేసిన షరీఅతులో యూదులు ధిక్కరించి స్వయంగా తామే తమకు శాసనకర్తలయినప్పుడు అనేక పరిశుద్ధ వస్తువుల్ని తమ రంధ్రాన్వేషణల మూలంగా హరామ్ చేసుకున్నారు. ఇటువంటి నూతన కల్పితాలు ఆహారపానీయాల విషయంలోనే కాక హక్కుల విషయంలో, ప్రవక్తల పవిత్ర జీవితాల విషయంలోనూ అనేకం మనకు దర్శనమిస్తాయి.

"వారికిలా చెప్పు: 'పరిపూర్ణమయిన వాదన అల్లాహ్‌దే". (అన్‌ఆమ్: 149)

(ఇంకా ఉంది)

క్విజ్ పోటీల్లో పాల్గొనండి విలువైన బహుమతులు గెలుచుకోండి



ఈ పోటీలు వివిధ భాషల్లో నిర్వహించబడుతున్నాయి

తెలుగు, తమిళ్, మళయాలం, సింగళం, ఫిలిప్పినీ, హిందీ

ముస్లిమేతరుల విభాగం

మొదటి బహుమతి: 70 దీనార్లు

రెండవ బహుమతి: 60 దీనార్లు

మూడవ బహుమతి: 50 దీనార్లు

గమనిక: జవాబు పత్రాలు 05-09-2012 తేదీ వరకు ఇచ్చేయ్యాలి. కనీసం 15 సమాధానాలు సరిగా ఉంటేనే తీసుకోబడతాయి. డ్రా ద్వారా ప్రతి భాషకు చెందిన ఆరుగురిని ఎంపిక చేయడం జరుగుతుంది. అలాగే ఒక స్త్రీ ఒక పురుషునికి మొబైల్ ఫోన్ అదనపు బహుమతిగా ఇవ్వబడును సమాధానాలు వ్రాసిన మీదట సమీప ఐపిసి బ్రాంచీలో జమా చేయాలి.

న్యూ ముస్లింల విభాగం

మొదటి బహుమతి: 70 దీనార్లు

రెండవ బహుమతి: 60 దీనార్లు

మూడవ బహుమతి: 50దీనార్లు

గమనిక: జవాబు పత్రాలు 05-09-2012 తేదీ వరకు ఇచ్చేయ్యాలి. కనీసం 15 సమాధానాలు సరిగా ఉంటేనే తీసుకోబడతాయి. డ్రా ద్వారా ప్రతి భాషకు చెందిన ఆరుగురిని ఎంపిక చేయడం జరుగుతుంది. అలాగే ఒక స్త్రీ ఒక పురుషునికి మొబైల్ ఫోన్ అదనపు బహుమతిగా ఇవ్వబడుతుంది. సమాధానాలు వ్రాసిన మీదట ఇస్లాం స్వీకరించినట్లు ధృవీకరణ పత్రం (సర్టిఫికెట్)ను జోడించి సమీప ఐపిసి బ్రాంచీలో జమా చేయాలి.

రమేజాన్ పోటీలు
ముస్లిమేతరులకు ప్రత్యేకం)

ఈ క్రింది ప్రశ్నలకు సరైన సమాధానం ఇవ్వండి:

(1) ఇస్లాం గ్రంథ ప్రజలను ఏ సమాంతర విషయం వైపునకు ఆహ్వానిస్తుంది?

జ:

(2) సామీ మతాలు, సామేతర మతాలు ఏవి?

జ:

(3) వేదాంత బ్రహ్మ సూత్రం ఏమంటుంది?

జ:

(4) సిఖ్ఖు మతంలో దైవం కోసం వాడబడిన 'వాహె గురూ' అన్న పదానికి అర్థం ఏమిటి?

జ:

(5) 'ఇస్రాయేలూ వినుము. మన దేవుడైన యెహోవా అద్వితీయుడగు యెహోవా' అన్న వాక్యం బైబిల్ పాత నిబంధనల్లోని ఏ కాండములో ఉంది?

జ:

(6) బైబిల్, ఎక్సోడస్ (నిర్గమకాండము) 20: 3-5 వాక్యాలలో ఏమని చెప్పబడింది?

జ:

(7) ఖుర్ఆన్‌లో 112వ సూరా సారాంశాన్ని పెర్కొనండి?

జ:

(8) దేవుడు మానవుడు కాలేడన్న అంశం క్రింద వచ్చిన కొన్ని దైవ గుణాలను పేర్కొనండి?

జ:

(9) దైవానికి శోభించని కార్యాలు ఏవి?

జ:

(10) దేవుని అంతిమ గ్రంథం ఏది, మరియు దేవుని అంతిమ ప్రవక్త ఎవరు?

జ:

క్రింది సమాధానాలు కరెక్టా (☑) కాదా (☒) తెలుపండి

1) అల్లాహ్‌కు గల పవిత్ర పేర్లు 99. వాటిలో మహోన్నతమైనది అల్లాహ్ ( )
2) అగోచర జ్ఞానము అల్లాహ్‌తోపాటు అన్యులకూ ఉంటుంది ( )
3) అల్లాహ్ ప్రతి గుణం సాటిసమానము లేనిది. అది ఆయనకు మాత్రమే ప్రత్యేకం ( )
4) దైవ అంతిమ ప్రవక్త ముహమ్మద్ (స) వారి రాకతో ధర్మం సంపూర్ణం అయింది. ( )
5) అల్లాహ్ ఒక గుణం ఆయన మరో గుణాన్ని రద్దు చేస్తుంది. ( )
6) ఖుర్ఆన్ అవతరణకు పూర్వం గ్రంథవహులైన ప్రజలు వారి స్వార్థం కోసం దైవగ్రంథాలలో మార్పులుచేర్పులకు పాల్పడ్డారు. ( )
7) అన్ని మతాలు చివరికి దేవుని ఏకత్వాన్ని ఒప్పుకోవు. ( )
8) పుట్టడం గిట్టడం తప్ప వేరే జీవితం లేదు. ( )
9) నిజ దైవం అల్లాహ్ మాత్రమే. ( )
10) దైవేతరులందరూ కలిసి ఒక్క ఈగను సయితం పుట్టించలేరు. ( )

మీ వివరాలు

పూర్తి పేరు:

.....

బతాఖా నెంబరు:

.....

☎టెలిఫోన్ నెంబరు:

.....

రమజాన్ పోటీలు

(న్యూ ముస్లింలకు ప్రత్యేకం)

ఈ క్రింది ప్రశ్నలకు సరైన సమాధానం ఇవ్వండి:

1) షిర్క్ అంటే ఏమిటి?

జ:

2) ఇస్లాం మూల స్థంభాలు ఎన్ని? అవి ఏవి?

జ:

3) తౌహీద్ అంటే ఏమిటి? మరియు తౌహీద్ ఎన్ని రకాలు?

జ:

4) ఈమాన్ అంటే ఏమిటి? మరియు ఈమాన్ మూలస్థంభాలు ఎన్ని? అవి ఏవి?

జ:

5) అల్లాహ్ ఎక్కడ ఉన్నాడు?

జ:

6) అల్లాహ్‌ను ఎవరన్నా చూడగలరా?

జ:

7) మున్కర్ నకీర్ ఎవరు?

జ:

8) ఒక ముస్లింకు మరొక ముస్లిం యెడల ఎన్ని హక్కులు న్నాయి?

జ:

9) షిర్క్ మరియు వేరే పాపాలలో తేడా ఏమిటి?

జ:

10) దైవప్రవక్త(స) ప్రతి సోమ, గురువారాలలో ఎందుకు ఉపవాసం పాటించేవారు?

జ:

క్రింది సమాధానాలు కరెక్టా (☑) కాదా (☒) తెలుపండి

1) సమాధుల తవాఫ్ (ప్రదక్షిణ) చేయవచ్చు. ( )
2) అగోచర జ్ఞానము అల్లాహ్ తప్ప అన్యులు ఎరుగరు. ( )
3) దీన్ విషయంలో పుణ్యఫలాపేక్షతో ఖుర్ఆన్ మరియు సహీహ్ హదీస్‌ల ఆధారం లేకుండా చేసే పనిని బిద్‌అత్ అంటారు. ( )
4) దైవప్రవక్త (స) కు మొత్తం సంతానం పదకొండు మంది. ( )
5) తన స్వస్థలంలో ఇస్లాం ధర్మం ప్రకారం జీవితం గడపటం కష్టతరమైతే హిజ్రత్ చేయవలెను. ( )
6) దైవప్రవక్త (స) రమజాన్ మాసంలో మదీనాలో జన్మించారు. ( )
7) దైవప్రవక్త (స) జనాజా నమాజుఅబూబకర్(ర) నాయకత్వం లో జరిగింది. ( )
8) ఖుర్ఆన్‌లో మొత్తం 30 సూరాలు ఉన్నాయి. ( )
9) ఖుర్ఆన్ పారాయణంలో ఒక అక్షరానికి పది పుణ్యాలు న్నాయి. ( )
10) షిర్క్ చేసేవారికి వారి సదాచరణలు ఉయోగపడతాయి. ( )

ఖాలీ స్థలాలను పూరించండి

1) దైవప్రవక్త(స) మాటలు, ఆచరణలు, వారి జీవిత విధానం మరియు సహాబాలు ఎవరైనా ఏదైనా ఆచరిస్తే దాన్ని ప్రవక్త(స) చూసి మౌనం వహించిన దానిని----------అంటారు.
2) ఎవరైతే ఈమాన్(విశ్వాస) స్థితిలో దైవప్రవక్త(స)ను కలిసి విశ్వాస స్థితిలోనే మరణించారో అలాంటి వ్యక్తి ---------- అనబడతారు.
3) ప్రాపంచిక కార్యకలాపాలన్నింటిని వదిలి పెట్టి దైవారాధన కోసం, దైవప్రసన్నతను చూరగొనే ఉద్దేశ్యంతో మస్జిద్‌లో ఆగి అల్లాహ్‌ను ఆరాధించటాన్ని----------అంటారు.
4) ఖుర్ఆన్‌ను నేర్చుకునేవారు, ఇతరులను నేర్పించేవారు మీలో----------.
5) ఖుర్ఆన్ మజీద్ అల్లాహ్-------, అది ---------- ద్వారా ----------పై----------సంవత్సరాల కాలం లో కొద్దికొద్దిగా అవతరించింది. అది సూర-------మొదలవు తుంది,--------తో ముగిస్తుంది.

మీ వివరాలు

పూర్తి పేరు:

.....

బతాఖా నెంబరు:

.....

☏టెలిఫోన్ నెంబరు:

.....



ఉర్దూ సంకలనం
ముహమ్మద్ అన్వర్ సలఫీ

సమాజానికి పట్టిన చీడ వడ్డీ పీడ

వడ్డీ వల్ల జరిగే నాశనాలు

1- వడ్డీ తినేవాడు దైవ కారుణ్యానికి దూరమైపోతాడు. అంతేగాకుండా ప్రవక్త(స) కు విరుద్ధంగా యుద్ధంలో ఉంటాడు.

2- అల్లాహ్ వడ్డీ తినేవారికి చేసినంత తీవ్రమైన హెచ్చరిక పెద్ద పెద్ద పాపాలకు పాల్పడిన వారి కోసం కూడా చేయలేదు.

3- వడ్డీ ఒక సామాజిక అపరాధం. ఇది ఏ సమాజంలో వ్యాపిస్తుందో ఆ సమాజాన్ని నాశనం చేసేస్తుంది. దాని ఆర్థిక స్థితిని పునాదులతో సహా పెకళిస్తుంది. అందువల్ల ప్రపంచ బ్యాంకు నుండి వడ్డీ మీద బాకీలు తీసుకున్న బీద దేశాలు వడ్డీ ఊబి నుండి బయటపడలేకపోతున్నాయి.

4- వడ్డీ తినేవాని ఆరాధన ఏదీ అల్లాహ్ సన్నిధిలో స్వీకరించ బడదు. హదీస్‌లో ఇలా చెప్పడం జరిగింది "హరాంతో కూడిన ఒక ముద్ద తిన్న కారణంగాఅతని నలభై రోజుల ప్రార్థన స్వీకరించబడదు." (తిర్మిజి) ఇంకా దైవప్రవక్త(స) ఇలా చెప్పారు: "ఒక వ్యక్తి ధరించిన దుస్తులలో తొమ్మిది దిర్హములు హలాల్‌గా ఉండి, ఒక దిర్హము హరాంగా ఉంటే అతను తొడిగిన దుస్తులు శరీరంపై ఉన్నంత వరకు అతని ఏ ఒక్క ఆరాధనా స్వీకరించబడదు. (ఇబ్నెమాజ)

5- అల్లాహ్ అప్పుడప్పుడు తిరస్కారి మరియు ముష్రిక్కుల దుఆ స్వీకరిస్తాడు గానీ, వడ్డీ తినేవాని ప్రార్థనను మాత్రం ఆమోదించదు. అది హజ్‌లాంటి పవిత్రమైన ప్రయాణంలో ఉన్నా సరే.

హజ్రత్ అబూహురైర(ర) కథనం ప్రకారం దైవప్రవక్త(స) ఇలా ప్రవచించారు: "అల్లాహ్ పరిశుద్ధుడు, శుద్ధతను మాత్రమే ఇష్టపడతాడు. ఈ విషయంలో ఆయన తన ప్రవక్తలను ఆదేశించిన విధంగానే తన విశ్వాసులకు కూడా ఆదేశం ఇచ్చాడు.

"అతను ఒక సుదీర్ఘ ప్రయాణం (హజ్) చేస్తాడు, చిందర వందర జుత్తుతో దుమ్ము దులారంతో నిండిన శరీరంతో (అరఫా మైదానంలో నిలబడి) చేతులు పైకెత్తి ప్రార్థిస్తాడు:"ఓ నా ప్రభూ! నా పరిపోషకుడా! కాని అతని ప్రార్థన స్వీకరించబడదు. ఎందుకంటే అతని అన్నపానీయాలు, బట్టలు,తిండి,అన్నీ హరాంతో కూడినవే.(ముస్లిం)

6- వడ్డీ తినేవాడు, తినిపించేవాడు, దానికి సంబంధించిన దస్తావేజులు,వ్రాసేవాడు, దాని సాక్ష్యం ఇచ్చినవాడు, ఈ హీనమైన పాపాన్ని వ్యాప్తి చెందడంలో సహకరించినవాడు అందరూ దైవ దృష్టిలో నేరస్తులు మరియు దైవకారుణ్యం నుంచి ధూత్కరించబడినవారే.

7- దైవప్రవక్త(స) ఎన్నోసార్లు వడ్డీ మరియు వ్యభిచారాన్ని కలిపి ప్రస్తావిస్తూ వచ్చారు. ఎందుకంటే ఇవి రెండు సామాజిక అత్యాచారాలు. ఇవి రెండూ సమాజంపైన చాలా చెడు ప్రభావం చూపిస్తాయి.

8- వడ్డీ హృదయంలో కాపట్యం,స్వార్థం, పిసినారితనం, హృదయకాఠిన్యం వంటి దుర్గుణాలు జనింపజేస్తుంది.హృదయం నుండి ప్రేమ, జాలి నశిస్తుంది. సోదరభావం అంతమవుతుంది. వడ్డీ వ్యవస్థ మానవ రక్తాన్ని పీల్చే జలగ వంటిది. దీనివల్ల సమాజంలో దోపిడీ పెచ్చరిల్లుతుంది. వడ్డీ వలన ఒక షైలాక్ (ఇచ్చిన బాకీ తిరిగి ఇవ్వలేదని బాకాయిదారుని తొడ నుండి కండను కోసిన వాడు)ని మాత్రమే జన్మనివ్వ లేదు, ప్రతి యుగంలో వేలాదిమంది షైలాక్‌ల పుట్టుకొస్తున్నారు, వస్తూనే ఉంటారు. వడ్డీ తినేవాడు దోపిడీ దొంగ వీరిద్దరిలో ఎవరు మేలు? అని ఇమాముల్ హింద్ మౌలానా అబుల్ కలాం ఆజాద్‌ని ప్రశ్నించగా ఆయన **"వడ్డీ తినేవానికంటే దొంగ ఎన్నో రెట్లు మేల"**ని సమాధానమిచ్చారు.

తెలుగు అనువాదం
షేఖ్ హబీబుర్రహ్మాన్

దైవప్రవక్త(స) ఇలా చెప్పారు: "ఒక వ్యక్తి ధరించిన దుస్తులలో తొమ్మిది దిర్హములు హలాల్‌గా ఉండి, ఒక దిర్హము హరాంగా ఉంటే అతను తొడిగిన దుస్తులు శరీ రంపై ఉన్నంత వరకు అతని ఏ ఒక్క ఆరాధనా స్వీకరించ బడదు. (ఇబ్నెమాజ)

ఎందుకంటే దొంగ హృదయంలో ప్రేమ, కరుణ,లాంటి భావాలు ఉంటాయి. ధనవంతులను దోచుకుని పేదవారికి సహాయపడిన వారు చాలా మంది చరిత్రలో దొరుకుతారు. కానీ వడ్డీ తినేవాని హృదయంలో మాత్రం దయాదాక్షిణ్యాలు ఉండవు. మరణించిన వడ్డీ వ్యాపారి కఫన్ నుండి వడ్డీ తీసుకునే అవకాశం ఉంటే అక్కడా వదలిపెట్టడు. (తబ్రుకాతె ఆజాద్)

9- వడ్డీ వల్ల సామాజిక విలువలలో అంతరాల అగాధాలు ఏర్పడతాయి, ధనిక-పేద వర్గాల మధ్య సంఘర్షణ జనిస్తుంది. కొన్ని సందర్భాలలో పేద వర్గానికి చెందిన వారు తట్టుకోలేక ధనవంతులను లూటీ చేయటం మొదలు పెడతారు. దీనివల్ల సమాజంలో ఉపద్రవాలు జనిస్తాయి. రెండో ప్రపంచ యుద్ధానికి కారణమయిన వాటిలో జర్మన్ వాసుల ఆర్థిక స్థితిపై ధనవంతు లైన యూదుల కఠినమైన వైఖరి కూడా ఒకటన్నది అందరికి తెలిసిన విషయమే. దాన్ని తట్టుకోలేక జర్మన్ సమాజం యూదు లపై తిరగబడింది. తత్ఫలితంగా హిట్లర్ లాంటి నాజీ పుట్టుకు వచ్చాడు. యూదుల ఊచకోతకు కారకుడయ్యాడు.

10- ఇది వడ్డీ తినేవాడి మనసులోని కల్మషానికి,చెడు సంకల్పానికి ప్రబల తార్కాణం.

11- వడ్డీ తినేవాడి ఈ పోకడ అతని దుష్పరిణామానికి, అతని వినాశానికి ప్రతీక.

హలాల్ సంపాదన శుభాలు

ఆల్లాహ్ వడ్డీకి బదులుగా వ్యాపారాన్ని ప్రాముఖ్యత ఇచ్చాడు. దాన్ని ముస్లిం కొరకు ధర్మసమ్మతంగా, పవిత్రంగా ఖరారు చేసాడు. హలాల్ సంపాదన వల్ల కలిగే కొన్ని శుభాలు:

1- హలాల్ (ధర్మసమ్మతమైన) సంపాదన అల్లాహ్ ప్రసన్నత చూరగొనటానికి, స్వర్గం చేరటానికి మార్గం సుగమం చేస్తుంది.

2- ఇది ప్రార్థనలు స్వీకరించబడటానికి దోహదపడుతుంది.

3- దీని వల్ల ఆయుష్షు పెరుగుతుంది. ధనంలో సమృద్ధి అవుతుంది.

4- ఇది (హలాల్ సంపాదన)ఇహలోకంలో గౌరవానికి, పరలోకంలో స్వర్గానికి హేతువు.

5- ఇది మాటల్లో తీయదనాన్ని, కర్మల్లో ఆకర్షణను సృజిస్తుంది.

6- హలాల్ సంపాదన వల్ల సంతానంలో శుభం కలుగుతుంది.

7- కష్టంతో పొందే సంపాదన మానవ మర్యాదను, ఉన్నతిని పెంపొందిస్తుంది.

అల్లాహ్ యావత్ ముస్లిములను వడ్డీ మరియు దాని కీడు నుండి కాపాడు గాక. (ఆమీన్)

ముహమ్మద్ ఖాన్
(గన్నవరం)

తొలి కాపయినా....

చెట్టేకదా
ప్రకృతి ఆభరణం
పచ్చని చెట్టే కదా
మనకు జీవనాధారము

నేను, చెట్టంత ఎదిగితే గాని
చెట్టుతో స్నేహం చేయలేకపోయాను

చెట్టుకు సంపూర్ణ స్వాతంత్ర్యము
ఎప్పుడు లభిస్తుంది?
ప్రశ్న చిత్రంగా ఉంది కదూ?
చెట్టును స్వేచ్ఛగా ఎదగనిస్తేనా
కొమ్మలు నరికి
ఆకులు చిదిమి
పూలు కోసి
కాయలు రాల్చి
ఇంకా, చెట్టుకు స్వేచ్ఛ ఎక్కడిది

ఏనాడైనా
తన పూలను తనివితీరా చూడగల్గిందా
ఎప్పుడు తనకు కాచిన కాయల్ని
సంపూర్ణంగా తులతూగి, స్వేచ్ఛగా
పక్షులకు, పశువులకు, ఉడతలకు
దానం చేయగల్గిందా?

కనీసం
మొట్ట మొదటి కాపయినా
తనను తాను తూగి
సంతోషం పొంది చెట్టు
తన పంటను ప్రకృతికి అర్పించగల్గిందా?

మొగ్గ పువ్వు తొడగడం ఆలస్యం
రాల్చే వరకూ
రాల్చి కొప్పున పెట్టుకునే వరకు
అస్సలు, నిద్ర పట్టదు!
పిందె తొడగటం ఆలస్యం
పెరిగి పెరగని దశలోనే
చెట్టుపై కన్నేసి
కాటు వేయందే వదలం!
ఇక, చెట్టుకు స్వేచ్ఛ ఎక్కడ?





మూలం
మౌలానా వహీదుద్దీన్ ఖాన్

ఓ మనిషీ! నిన్ను నువ్వు తెలుసుకో!





నేడు మానవుడు ఎదుర్కొంటున్న అన్నిటి కన్నా పెద్ద సమస్య ఏది? అని ఎ సమావేశంలోనైనా ప్రశ్నను లేవనెత్తితే ఒక్కొక్కరు ఒక్కో విధంగా సమాధానమిస్తారు. అణ్వాయుధాల తయారీ నేటి అతిపెద్ద సమస్య అనీ, దాన్ని నివారించాలని ఒకడంటే, నేడు ప్రపంచంలో పెరుగుతున్న జనాభాయే మానవాళి పాలిట అన్నిటి కన్నా పెద్ద సమస్య అని మరొకరు తేల్చి చెబుతారు. ఉత్పత్తులు మరియు పంపిణిల వ్యవస్థను చక్కదిద్దడమే నేటి మానవుని అత్యంత ముఖ్యమయిన సమస్య అని ఇంకొకరంటారు. చెప్పవచ్చేదేమిటంటే ఇటువంటి ప్రశ్నకు రకరకాల సమాధానాలు వినవస్తాయి. దీన్ని బట్టి స్పష్టమయ్యేది ఏమిటంటే మానవుడు మానవుణ్ణి కూడా ఇంకా తెలుసుకోలేకపోయాడు. అతను తన్ను తాను తెలుసుకొని ఉంటే అందరి సమాధానం ఒక్కటే అయి ఉండేది. మానవుడు తన నిజ స్థానమేదో మరచిపోవడమే నేటి అతి పెద్ద సమస్య అనీ, తాను ఎదో ఒకనాడు మరణించవలసి ఉందనీ, మరణించిన తరువాత తన లెక్కల రికార్డును సమర్పించుకోవడానికి తన స్వామి సన్నిధిలో హాజరు కావలసి ఉందన్న యదార్థాన్ని విస్మరించడమే అతని అన్నిటి కన్నా పెద్ద సమస్య అని అందరూ ముక్త కంఠంతో పలికేవారు. ఒకవేళ మనం ఈ జీవితపు వాస్తవికతను అర్థం చేసుకుంటే ఈప్రపంచాన్ని కాదు, పరలోకాన్ని అసలు సమస్య అని పరగణించి ఉండేవాళ్ళం.

నేడు కూడా ప్రపంచంలో ఎంతో మంది దైవాన్నీ, పరలోకాన్నీ విశ్వసిస్తారు. వారు ఈ మౌలిక విశ్వాసాల పట్ల ధిక్కారి వైఖరికి పాల్పడటం లేదు కూడా. కాని ఏం ప్రయోజనం? వారి ఆచరణలకు – విశ్వాసాలకు మధ్య పొంతనే ఉండదు. నిజ జీవితంలో ప్రతి వ్యక్తి ముందు ఉన్న ప్రశ్న ఒక్కటే–ఈ ప్రపంచాన్ని ఎలా తీర్చి దిద్దుకోవాలి? ఈ లోకంలో తను ఎలా రాణించాలి? అన్న ధ్యాస తప్పితే అతనికి మరో ఆలోచనే లేకుండా పోయింది. భూమి గురుత్వాకర్షణ శక్తి హరించుకుపోయిందనీ అది గంటకు ఆరు వేల మైళ్ళ వేగంతో సూర్యుని వైపునకు లాక్కుపోబడుతుందని మన పరిశోధనా కేంద్రాలు ఏ రోజైనా ప్రకటించాయనుకోండి, ఒక్కసారిగా ప్రపంచమంతటా కలకలం బయలు దేరుతుంది. ఎందుకంటే ఆ వార్త అటువంటిది మరి! ఆ సమాచారం ప్రకారం కొన్ని వారాల్లోపే ధరణిలో ఏ ప్రాణీ మిగలకుండా పోతుంది.

అయితే ఈ ప్రపంచం అనుక్షణం ఇంత కన్నా తీవ్రమయిన, ఘోరమయిన విపత్తుతో సతమతమవుతోంది. కాని దాని యెడల కలవర పడేవాడే కానరాడు. ఏమిటా విపత్తు? అదే ప్రళయ దినం. భూమ్యాకాశాలు పుట్టిననాడే అది కూడా నెలకొన్నది. మనమందరం దాని వైపునకు అతి శీఘ్రంగా పరుగులు తీస్తున్నాము. ఈ విషయాన్ని సూత్రప్రాయంగా అందరూ అంగీకరిస్తారు. అయితే దీనిపై సావధానం గా ఆలోచించేది బహుకొద్ది మంది మాత్ర మే. మీరు సాయం సమయంలో ఏబజారు కైనా వెళ్ళి, అక్కడ ప్రజలు ఎంత హడావిడిగా సంచరిస్తున్నారో చూస్తూ నిలబడండి– నేటి మానవుడు దేన్ని అత్యంత ముఖ్యమయిన సమస్యగా తీసుకున్నాడో మీకే అర్థ మవుతుంది. మీరే ఊహించండి – కిక్కిరిసిన బజారులో మోటారు వాహనాలు ఎందుకు వస్తూ పోతున్నాయి? షాపుల యజమానులు తమ షాపులను ముస్తాబు చేసి ఎందుకు కూర్చున్నట్టు? ప్రజలు తండోప తండాలుగా అక్కడికి ఎందుకు వచ్చిపోతున్నట్టు? ప్రజలు దేన్ని గురించి సంభాషించుకుంటున్నారు? ఒకరినొకరు ఏ ఉద్దేశ్యంతో పలకరించుకుంటున్నారు? ఏఏ వస్తువులపై వారు మోజు పడుతున్నారు? విలువైన వారి శక్తిసామర్థ్యాలు, వారి జేబు

డబ్బులు ఏఏ ఆశయాలు, లక్ష్యాలు కొరకు ఖర్చవుతున్నాయి? సంతోషంతో ఉన్న వారంతా దేన్ని పొంది సంతోషిస్తున్నట్టు? విచారంగా ఉన్నవారంతా దేన్ని కోల్పోయి అలా ఉన్నట్టు? ప్రజలు తమ ఇళ్ళ నుంచి ఏం తెచ్చారు? ఏం పుచ్చుకుని మరలి వేళుతున్నారు? ఆయా ప్రజల వ్యాపకాల ద్వారా వారి నోట వినవచ్చే మాటల ద్వారా, వారి హావభావాల ద్వారా, చేష్టల ద్వారా మీరు మీ ప్రశ్నలకు సమాధానాలు తెలుసుకోగలిగితే నేటి మనిషి దేన్ని తన ముఖ్యమైన సమస్యగా భావిస్తున్నాడో, మరి దేన్ని స్వంతం చేసుకోవటానికి ఆరాట పడుతున్నాడో మీకు అర్థమవు తుంది.

కిటకిటలాడే బజార్లయినా, తీరిక లేని రోడ్లపై నిరంతరం ప్రజల రాకపోకల ధ్వనులైనా పెట్టే ఘోష ఒక్కటే–నేటి మాన వుడు కోర్కెల వెనుక పరుగులు తీస్తు న్నాడు! అతను పరలోకాన్ని కాదు, కేవ లం ప్రపంచాన్ని సొంతం చేసుకోవాలను కుంటున్నాడు. నేడు అతను ఆనందంగా ఉన్నాడంటే అతని ప్రాపంచిక కోర్కెలు, లక్ష్యాలు నెరవేరుతున్నందుకే అలా ఉన్నాడు. ఒకవేళ అతను విచారంగా ఉన్నాడంటే అతని భౌతిక అవసరాలు తీరనందుకే, తీరే అవకాశాలు కూడా లే నందుకే విచారిస్తున్నాడు. నేటి అవస రాలు, నేటి సుఖసంతోషాలు, నేటి గౌరవ మర్యాదలు, నేటి అవకాశాలు–ఇవి ప్రాప్త మయితే చాలు. అదే మహా భాగ్యం! అదే గొప్ప విజయం. అని ప్రజలు తలపోస్తు న్నారు. అవి గనక ప్రాప్తించకపోతే దాన్ని తమ దౌర్భాగ్యంగా, అపజయంగా పరిగ ణిస్తున్నారు. వాటి కోసమే మానవ సమూ హమంతా పరుగులు తీస్తోంది. ఎవరికీ రాబోయే రోజు గురించిన చింతనే లేదు. ప్రతి ఒక్కరూ **'ఈ రోజు'** కొరకే ప్రాకులా డుతున్నారు. దాని కొరకే అర్రులు చాస్తు న్నారు. దాని వెనకే పిచ్చివారై తిరుగు తున్నారు.

ఇది కేవలం పెద్ద పెద్ద పట్టణాల, నగ రాల పరిస్థితి మాత్రమే కాదు – ఎక్కడ కొంత మంది కలిసి నివసిస్తున్నా వారి పరిస్థితి ఇంచుమించు ఇంతే. మీరు ఎవరిని చూసినా, వారు ఈ ఆలోచనలోనే మునిగి ఉన్నట్టు కనిపిస్తారు.

నేడు అతను ఆనందంగా ఉన్నాడంటే అతని ప్రాపంచిక కోర్కెలు, లక్ష్యాలు నెరవేరుతున్నందుకే అలా ఉన్నాడు. ఒకవేళ అతను విచారంగా ఉన్నాడంటే అతని భౌతిక అవసరాలు తీరనందుకే, తీరే అవకాశాలు కూడా లేనందుకే విచారి స్తున్నాడు. నేటి అవస రాలు, నేటి సుఖసంతోషాలు, నేటి గౌరవ మర్యాదలు, నేటి అవకాశాలు-ఇవి ప్రాప్త మయితే చాలు. అదే మహా భాగ్యం! అదే గొప్ప విజయం. అని ప్రజలు తలపోస్తు న్నారు.


స్త్రీ అయినా–పురుషుడైనా, ధనికుడైనా – బీదవాడైనా, వృద్ధుడైనా–యువకుడైనా, పండితుడైనా – పామరుడైనా, పల్లెవాసి అయినా–పట్టనవాసి అయినా, ఆఖరికి ఆస్తికుడైనా– నాస్తికుడైనా – అందరూ ఒకే దిక్కున పోతున్నారు. ఈ లోకంలో ఎంత గా జుర్రుకునే వీలు పడితే అంతగానూ జుర్రుకోవాలన్నదే నేటి మానవుని అభి మతం అయిపోయింది. దాన్నే అతను తన 'కర్తవ్యం'గా పరిగణిస్తున్నాడు. దాని కోసమే తన విలువైన సమయాన్ని, అమూ ల్యమయిన శక్తిసామర్థ్యాలను వెచ్చి స్తున్నాడు. ఈ ఆలోచనలోనే రేయింబవళ్లు మునిగి ఉన్నాడు. ఈ ఆలోచన ఆఖరికి ఎంత తీవ్రస్థాయికి, పరాకాష్ఠకు చేరుకుం దంటే, ఒకవేళ తన అంతరాత్మను, విశ్వా సాన్ని పణంగా పెడితేగాని కోరిన వస్తువు చేజిక్కదనుకుంటే, అప్పుడు తన అంతరా త్మను, విశ్వాసాన్ని (ఈమాన్‌ను) కూడా ఆ కోర్కెల దేవతకు నైవేద్యంగా సమ ర్పించటానికి సిద్ధమవుతున్నాడు. చెప్ప వచ్చేదేమిటంటే ఏ రకంగానయినా సరే, ఏ అడ్డ దారులు త్రొక్కయినా సరే అతను ఈ ప్రాపంచిక సుఖాలను జుర్రుకోవటా నికి పరితపిస్తున్నాడు.

అయితే ఈ విధంగా సాధించిన ఏ విజయమైనా, అది కేవలం ప్రాపంచిక విజయం మాత్రమే. పరలోకంలో అది ఏ విధంగానూ ఉపయోగపడదు. ఎవరయితే నేటి తన లోకాన్ని తీర్చిదిద్దుకునే తాపత్ర యంలో పడిపోయి పరలోకాన్ని విస్మరిం చాడో, అతని దృష్టాంతం ఎలాంటిదంటే, ఒక వ్యక్తి యుక్త వయస్సులో ఉన్నాడు. కాని వృద్ధాప్యం కోసం ఏమీ వెనకేసుకోవ టం లేదు. క్రమేణా అతని శక్తులన్నీ ఉడిగి పోతాయి. **'ఇక నువ్వు కష్టపడలేవు, విశ్రాంతి తీసుకో'** అని అతని శక్తులు అతన్ని హెచ్చరించే సరికి అతను కళ్లు తెరుస్తాడు, తనకెక్కడా ఆశ్రయం లేదని అతనికి అప్పుడు తెలిసి వస్తుంది.

తనకంటూ ఒక ఇల్లు లేదే! అన్న స్పృహ అతనికి అప్పుడొస్తుంది. కాని ఇప్పుడతను ఇల్లు కట్టుకోలేడు. వాతావరణానికనువ యిన దుస్తులు, దుప్పట్లు తనకు లేవే! అని పిస్తుంది. కాని మనసైన దుస్తులు, దుప్ప ట్లు సమకూర్చుకునే స్థోమత ఇప్పుడతని వద్ద లేదు. తిండితిప్పల కోసం తన దగ్గర ఏమీ లేదే అన్న విషయం తెలియవస్తుంది. కాని ఈ వయసులో అతని దాన్ని ఏర్పాటు చేసుకోగలిగే స్థితిలో లేడు మరి! అశక్తుడై, అసూయతో ఇప్పుడతను ఏదో ఒక గోడకు ఆనుకొని–చతికలబడి – ఉన్నాడు' అతన్ని చూసిన కుక్కలు మొరుగుతాయి. దారిన పోయే తుంటరులు అతనిపై రాళ్లు రువ్వు తారు. మనం ఇలాంటి దృష్టాంతాలను మన కళ్ళతోనే చూసినప్పుడు, పరలోకం లో పనికి వచ్చే సామగ్రిని సమకూర్చుకోని వాడి స్థితి ఎలా ఉండగలదో స్థూలంగా అంచనా వెయవచ్చు. ఇలాంటి సంఘట నలు, ఇటువంటి దృష్టాంతాలు అనుని త్యం మనకు తారసపడుతున్నప్పటికీ మన లో ఎలాంటి కదలికా, సంచలనం కలగ టం లేదు. మనలో ప్రతి ఒక్కరూ నేటి జీతాన్ని నందనవనంగా తీర్చిదిద్దుకోవటం లోనే మునిగిపోయి ఉన్నారుగాని రేపటి తన బాగోగుల గురించి బొత్తిగా ఆలోచిం చట్లేదు.

"ఏమిటి విశ్వాసుల హృదయాలు అల్లాహ్ జ్ఞాపకం పట్ల, ఆయన అవతరింపజేసిన సత్యం పట్ల మెత్తబడే (కంపించిపోయే) సమయం ఇంకా ఆసన్నం కాలేదా. వీరికి ముందు గ్రంథం వొసగబడినవారి మాదిరిగా వీరు కాకుడదు. మరి ఆ గ్రంథవహులపై ఒక సుదీర్ఘ కాలం గడిచి పోయే సరికి వారి హృదయాలు కఠినమై పోయాయి". (అల్ హదీద్: 16)

షేఖ్ సలీమ్ జామయీ



మొక్కుబడి వాస్తవికత

మొక్కుబడి నిర్వచనం: మానవుడు ఒక ప్రత్యేక సందర్భంలో తనపై విధిగా లేని ఒక కార్యాన్ని తనపై విధిగా చేసుకోవటాన్ని మొక్కుబడి అంటారు. ఉదాహరణకు: కొంత మంది పేదవారికి బట్టలు పంచుతానని, కొందరి దాహార్తి తీర్చే ఏర్పాటు చేస్తానని, కొందరికి అన్నదానం చేస్తానని దైవానికి మొక్కుకోవడం వలన ఆ వ్యక్తిపై విధిగాలేని ఒక కార్యం మొక్కుబడి చేసుకున్నాక విధిగా మారిపోతుంది.

మొక్కుబడి ఒక ఆరాధన: అల్లాహ్ మానవునికి నిర్దేశించిన ఆరాధనలు – నమాజు, రోజా, జకాత్, హజ్జ్, దుఆ మొదలయిన వాటిలాగే మొక్కుబడి కూడా ఒక ఆరాధన. మొక్కుబడి ప్రస్తావన అటు దివ్య ఖుర్ఆన్‌లోనూ, ఇటు దైవప్రవక్త (స) వారి హదీసుల్లోనూ వచ్చింది. ఖుర్ఆన్‌లో ఇలా ఉంది: **"మీరు దైవ మార్గంలో ఎంత ఖర్చు చేసినా ఏ మొక్కుబడి చేసుకున్నా అల్లాహ్‌కు దాని గురించి పూర్తిగా తెలుసు".** (అల్ బఖర: 270)

సజ్జనుల లక్షణం మొక్కుబడి తీర్చడం: మొక్కుబడి చేసుకున్నాక తప్పక చెల్లించడం సజ్జనుల లక్షణమని ఖుర్ఆన్‌లోని దహ్ర్ అధ్యాయంలో పేర్కొనబడింది: **"వారు తమ మొక్కుబడులను చెల్లిస్తూ ఉంటారు. కీడు నలువైపులా విస్తరించే రోజు గురించి భయపడుతుంటారు".** (76: 7)

మొక్కుబడి చేసుకున్న ఈసా (ఏసు) అమ్మ మరియు అమ్మమ్మ: ప్రవక్త ఈసా (అ) వారి అమ్మమ్మ గర్భం దాల్చినప్పుడు ఇలా మొక్కుకుంది: **"ఆ సందర్భాన్ని జ్ఞాపకం చేయి – ఇమ్రాను భార్య ఈ విధంగా వేడుకున్నది: ఓ నా ప్రభూ! నా గర్భంలో ఉన్నదానిని నీ సేవ కోసం అంకితం చేయాలని మొక్కుకున్నాను. నీవు నా తరఫున దీనిని స్వీకరించు".** (ఆల్ ఇమ్రాన్: 35)

ప్రవక్త ఈసా (అ) గారి తల్లి మర్యమ్ (అ) సయితం గర్భిణిగా ఉన్నప్పుడు అల్లాహ్ ఆవిడకు ఏ పురుష సంపర్కం లేకుండానే ప్రపంచానికి ఒక సూచనగా పుట్టించబోతున్న ఆ బిడ్డ ప్రత్యేకతను గ్రహించని జనులు అర్థరహితంగా ప్రశ్నలు వేస్తే ఏమి సమాధానం ఇవ్వగలనని హాజ్రత్ మర్యమ్ (అ) కంగారు పడుతుంటే, అల్లాహ్ ఆమెను, ఉపవాసం మొక్కుబడి చేసుకున్నాను ఎవ్వరితోనూ మాట్లాడనని సమాధానమివ్వమన్నాడు: **"ఏ మనిషైనా నీకు తారసపడితే నేను కరుణామయుని కోసం ఉపవాస వ్రతం పాటిస్తున్నాను. ఈ రోజు నేను ఎవరితోనూ మాట్లాడనను"** అని చెప్పు.

(దివ్యఖుర్ఆన్–19: 26)

మొక్కుబడి నియమాలు: మొక్కుబడి గురించి అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త ముహమ్మద్ (స) వారు కొన్ని నిబంధనలు, నియమాలను తెలియజేశారు. అవేమంటే....

1) మొక్కుబడి తప్పక నెరవేర్చాలి: మొక్కుబడి చేసుకున్నవారు తప్పనిసరిగా తమ మొక్కుబడిని చెల్లించాలి: **"ఆ తర్వాత వారు తమ మురికిని దూరం చేసుకోవాలి. తమ మొక్కుబడులను చెల్లించాలి".** (హజ్జ్:29)

2) మరణించిన వారి మొక్కుబడిని వారి వారసులు చెల్లించాలి: మొక్కుబడి చేసుకున్న వారు మొక్కుబడి తీర్చకుండానే మరణిస్తే వారి వారసులకు ఆ విషయం తెలిసి ఉంటే వారు ఆమొక్కుబడిని తీర్చాలి. ప్రవక్త ముహమ్మద్ (స) వారి జీవిత కాలం లో జుహైనా తెగకు చెందిన ఒక మహిళ ఆయన (స) వద్దకు వచ్చి – 'ఓ ప్రవక్తా (స)! నా తల్లి హజ్జ్ చేస్తానని అల్లాహ్‌తో మొక్కుబడి చేసుకొని మొక్కుబడి తీర్చక ముందే మరణించింది. ఆమెకు బదులుగా నేను ఆ మొక్కుబడి తీరిస్తే చెల్లుతుందా?' అని అడిగింది. దానికి ప్రవక్త (స) **"నువ్వు తప్పనిసరిగా ఆమె మొక్కుబడిని చెల్లించా"**లని నొక్కివక్కాణించారు. (బుఖారీ)

3) ధర్మం సమ్మతించిన విషయాల పరిధిలోనే మొక్కుబడి చేసుకోవాలి: దైవ ప్రవక్త (స) ఇలా ప్రబోధించారు: **"దైవాజ్ఞ విదేయత కొరకు మొక్కుబడి చేసుకున్న వ్యక్తి ఆ మొక్కుబడిని చెల్లించాలి".**(ముత్తఫఖున్ అలైహి) ఉదాహరణకు– నమాజు, ఉపవాసం, ఉమ్రా, ధాన ధర్మాలు మొదలయినవి.

4) అధర్మ కార్యాల్లో మొక్కుబడి చేసుకోకూడదు: అల్లాహ్ నిషేధించిన కార్యాలపై మొక్కుబడి చేసుకోరాదని ప్రవక్త (స) సెలవిచ్చారు. **"దైవ అవిధేయతా విషయమై మొక్కుబడి చేసుకున్న వ్యక్తి ఆ మొక్కుబడి చెల్లించరాదు".**(ముత్తఫఖున్ అలైహి) ఉదాహరణకు: నేను పది మందికి సారాతాపిస్తానో,ఖవ్వాలీ పెట్టి

స్తానతో,సమాధిపై చాదర్ కప్పుతానతో మొక్కుబడి చేసుకోవడం. పై కార్యాలన్నీ హరామ్. కాబట్టి ఇలాంటి మొక్కుబడులు చేసుకోరాదు. ఒకవేళ తెలియని కారణంగా చేసుకొని ఉన్నా వాటిని చెల్లించాల్సిన అవసరం లేదు. చెల్లించకూడదు.

5) తన అధీనంలో లేని విషయాలపై మొక్కుబడి చేయరాదు: మనిషి తన శక్తిసామర్థ్యాలకు మించిన విషయాలపై మొక్కుబడి చేసుకోరాదు.**'తన అధీనంలో లేని విషయాలపై మానవుడు మొక్కుబడి చేయరాదు'** అని ప్రవక్త (స) సెలవిచ్చారు. (ముస్లిం)

6) అర్థరహితమయిన విషయాలపై మొక్కుబడి చేయరాదు: అనవసరమయిన, అర్థరహితమయిన విషయాలపై మొక్కుబడి చేయరాదని ప్రవక్త (స) వారి జీవితంలో జరిగిన ఓ సంఘటన ద్వారా మనకు అర్థమవుతుంది. ఓ సారి ప్రవక్త (స) మస్జిద్‌లో ప్రసంగిస్తుండగా అబూ ఇస్రాయిల్ అనే పేరు గల సహాబీ మస్జిద్ వెలుపల ఎండలో నిలబడి ఉన్నాడు. అది గమనించిన ప్రవక్త (స) ఎందుకు ఆ వ్యక్తి బయటనే నిలబడి ఉన్నాడు? అని ప్రశ్నించారు. అతను **'ఎండలోనే ఉంటాను; నీడలోకి వెళ్ళను, నిలబడే ఉంటాను; కూర్చోను, మౌనంగానే ఉంటాను; ఎవరితోనూ మాట్లాడను, పస్తులతోనే ఉంటాను; ఏమి తినను'** అని మొక్కుబడి చేసుకున్నాడని ఇతర సహాబాలు తెలిపారు. అది విన్న ప్రవక్త (స) (అతని ఆ చర్యకు గర్హిస్తూ) **'అతన్ని వెంటనే నీడలోకి వచ్చి, కూర్చోని, మాట్లాడమని చెప్పండి. ఆఁ ఉపవాసాన్ని అతను పూర్తి చేయాలి'** అన్నారు. (బుఖారీ)

7) మొక్కుబడి కేవలం అల్లాహ్‌తో మాత్రమే చేసుకోవాలి: మొక్కుబడి ఒక ఆరాధన అని మనం ఇదివరకే తెలుసుకున్నాము. ఆరాధన పెద్దదయినా, చిన్నదయినా అది కేవలం అల్లాహ్ కొరకు మాత్రమే చేయాలని అల్లాహ్ తాకీదు చేశాడు. **"మీ ప్రభువు స్పష్టంగా ఆజ్ఞాపించాడు మీరు ఆయనను తప్ప మరొకరిని ఆరాధించకూడదు".** (ఇస్రా: 23)

"అల్లాహ్‌ను ఆరాధించండి. ఆయనకు సహవర్తులుగా ఎవరినీ కల్పించకండి". (నిసా: 736)

పై ఆయతుల దృష్ట్యా మనం మన ఉపాసనారీతులన్నింటిని అవి – ధనపరమైనవైనా, వాక్కుపరమయినవైనా, కర్మపరమయినవైనా అల్లాహ్ కొరకు మాత్రమే ప్రత్యేకించాలి. ఇతరుల పేర మొక్కుబడి చేసుకోవడం అనేది ముమ్మాటికి బహుదైవారాధనే అవుతుంది. షిర్క్ – బహుదైవారాధనను అల్లాహ్ ఎన్నటికి మన్నించడు. అయితే ఈ వాస్తవాన్ని గ్రహించని అనేక మంది ముస్లిం సోదరులు జెండా మాన్ల వద్ద, పీర్ల ప్రతిమల వద్ద, దర్గాల (సమాధుల) వద్ద, పుట్టల వద్ద, పాముల వద్ద మొక్కుబడు చేసుకుంటున్నారు. అంతే కాకుండా వందల మైళ్ళు ప్రయాణం చేసి మరీ తలనీలాలు సమర్పించుకొని చేసుకున్న మొక్కుబడులు తిర్చేసుకున్నామని మురిసిపోతున్నారు. వాస్తవానికి వారు అల్లాహ్‌కు ఇతరలను భాగస్వాములుగా చేసి మహా పాతకానికి, ఘోర పాపనికి ఒడిగడుతున్నారు. వారి తక్షణ చర్య ఏమిటంటే, వెంటనే వారు చేసిన నిర్వాకంపై కన్నీరుమున్నీరవుతూ కరుణామయుని సన్నిధిలో తౌబా చేసుకోవాలి. జీవితంలో ఇకమీదట అటువంటి పాతకానికి పాల్పడమని లెంపలేసుకొని మరీ ప్రతీన బూనాలి.

మొక్కుబడి వల్ల ప్రయోజనం: మొక్కుబడి చేసుకోవడం వల్ల ఏదో పెద్ద మహిమే జరిగిపోతుందని భావించడం తరచూ మనం చూస్తూ ఉంటాము. ఇదంతా ఓ అభూత కల్పన, ఒర్థి భ్రాంతి మాత్రమే. వాస్తవంగా మొక్కుబడి వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండబోదని మహా ప్రవక్త ముహమ్మద్ (స) తేల్చి చేప్పేశారు: **"నిశ్చయంగా మొక్కుబడి విధివ్రాతను ఎంత మాత్రం మార్చజాలదు. మొక్కుబడి ద్వారా అల్లాహ్ పిసినారి నుండి కొంత సొమ్మును రాబట్టుతాడు అంతే".** (బుఖారీ)

ధార్మిక పండితుల అభిప్రాయం: మొక్కుబడి నిశ్చయంగా ఒక ఆరాధన. కాకపోతే ఇది అయిష్టకరమయినది. ఎందుకంటే షరతుతో కూడిన మొక్కుబడి ద్వారా దాసుడి స్వార్థప్రియత్వం బహిర్గతమవుతుంది. దాసుడు ఒక మంచి కార్యం చేయడానికి అల్లాహ్‌తో షరతు పెట్టుకుంటాడు. నా ఫలాన కోరిక తీరితే నేను ఫలానా సత్కార్యం చేస్తాను అని మొక్కుబడి చెసుకోవడంతో అతని స్వార్థం బట్టనయలవుతుంది. అంటే, అతని కోరిక తీరితేనే అతను పుణ్యకార్యం చేస్తాడు; అన్యదా చేయడన్న మాట. ఈ కారణంగానే కొందరు ధర్మవేత్తలు షరతుతో కూడిన మొక్కుబడిని లంచంతో పోల్చారు. అయితే ఎలాంటి షరతు పెట్టకుండా ఒక మంచి కార్యాన్ని తమపై విధిగా చేసుకోవడం మాత్రం అభిలషనీయమన్నారు.

ఇక షరతుతో కూడిన మొక్కుబడి చేసుకునేవారు ఒక్క క్షణం ఆలోచించాలి. ఎవరయినా మన వద్దకు వచ్చి మీరు నా ఫలాన పని చేసి పెడితే ప్రతిగా నేను మీ ఫలానా కార్యం చేసి పెడతాను' అనంటే అతన్ని పచ్చ స్వార్థపరుడి క్రింద జమకడతాముగా! మరి మనమే ఆ పని చేస్తున్నామాయే! అదీ ఎవరితో! అనంత కరుణామయుడు అపార దయానిధి అయిన అల్లాహ్‌తో – నువ్వు నా ఫలానా పని చేసి పెడితే నేను ప్రతిగా ఫలానా పని చేస్తాను అని అల్లాహ్‌తో ఒప్పందానికి దిగడం ఎంత వరకు సమంజసం? ఈ కారణంగానే ఇటువంటి షరతుతో కూడిన మొక్కుబడి ధర్మసమ్మతమయినప్పటికీ దాన్నో అయిష్టకరమైన కార్యంగానే ఎంచారు ధర్మవేత్తలు.

ముఖ్య గమనిక: మొక్కుబడి చేసుకునేవారు అధర్మ విషయాలపై చేసుకోకుండా జాగ్రత్త పడటమే కాకుండా పూర్వం అజ్ఞాన కాలంలోగానీ, ప్రస్తుతంగాని విగ్రహాల, ఔలియాల పేరిట బలిచ్చే ప్రదేశాల్లో తమ పశువులను జిబహ్ చేస్తామని మొక్కుకోకూడదు. ఒక వ్యక్తి మొక్కుబడి చేసుకొని తీర్చలేకపోతే – అది షరతుతో కూడిన మొక్కుబడి అయినా ఎలాంటి ముందస్తు షరతు లేని మొక్కుబడి అయినా సరే అతను పరిహారం (కఫ్ఫారా) చెల్లించాలి. ఖుర్‌ఆన్‌లో ఇలా ఉంది: **"ఇటువంటి ప్రమాణ భంగానికి మీరు చెల్లించవలసిన) కఫ్ఫారా ఏమిటంటే, మీరు మీ ఇంటి వారికి పెట్టే మధ్య రకపు అన్నం పది మంది పేదలకు తినిపించాలి. లేదా (మీరు మీ ఇంటి వారికి తొడిగించే మధ్య రకపు) బట్టలు వారికివ పెట్టాలి. లేదా ఒక బానిసకో, బానిసరాలికో స్వేచ్ఛనొసగాలి. ఇవేవీ చేయలేని వాడు మూడు రోజులు ఉపవాసం పాటించాలి. మీరు ప్రమాణాలు చేసినప్పుడు (వాటిని భంగపరచినందుకుగాను ఇచ్చే) పరిహారం ఇది. అందుకే మీరు ప్రమాణాల విషయంలో చాలా అప్రమత్తంగా ఉండండి. ఈ విధంగా మీరు కృజ్ఞతా పూర్వకంగా మసలుకునేందుకుగాను అల్లాహ్ మీ కోసం తన ఆదేశాలను తేటతెల్లం చేస్తున్నాడు".** (మాయిదా: 89)

- జమాల్ షత్తీ
(ఐపిసి జనరల్ మేనేజర్)



విశ్వాస వికాసానికి విలువైన సూత్రాలు

ఇహలోక జీవితం ఏదోక రోజు నశించే తటాకమే శాశ్వత నివాసం కాదు. ఈ యదార్థాన్ని గ్రహించిన మనం ఇక్కడ మనకు లభించిన స్వల్ప వ్యవధిలోనే పరలోక సాఫల్యానికి పనికొచ్చే సాధనాల్ని సాధించుకోవాలి. మనల్ని, మన పరివారాన్ని నరకాగ్ని నుండి కాపాడుకోవాలి. ఎందుకంటే ఈ రోజు కర్మలున్నాయి, లెక్క లేదు. రేపు లెక్కలుంటాయి, కర్మలుండవు. కాబట్టి మన లెక్క దేవుడు మనతో తీసుకోక ముందే మన లెక్కల్ని మనం సరిచేసుకోవాలి.

ఇప్పుడు నేనేం చేయాలి?



1) **"మీ కోసం దేన్నయితే ఇష్ట పడతారో దాన్నే మీతోటి సోదరుల కోసం ఇష్ట పడాలి"** అన్నారు మన ప్రియ ప్రవక్త ముహమ్మద్ (స). కాబట్టి మీరు మెచ్చి స్వీకరించిన ఇస్లాం ధర్మం వైపు మీ పరిచయస్తుల్ని, పరివారాన్ని ఆహ్వానించండి.

2) ఆనందం, సంతోషం అది ఎలాంటిదయినా తొలిసారి కలిగిన అనూభూతి వేరుగా ఉంటుంది. కనుక ఇస్లాం స్వీకరించిన ప్పుడు మీకు కలిగిన మధురానుభుతిని మీ పరిచయిస్తులతో, పరివారంతో పంచుకోండి.

3) **'నా నుండి ఓ వాక్యాన్ని విని, దాన్ని అర్థం, ఆకళింపు చేసుకుని, కంఠస్థం చేసుకుని (అమలు పరచి) ఇతరులకు చేరవేసిన వ్యక్తిని, అల్లాహ్ సకల సౌభాగ్యాలతో, సౌఖ్యాలతో పర్థిల్లజేయుగాక!'** అని కారుణ్యమూర్తి (స) వారు దీవించడమేకా **'బహుశా వినే వ్యక్తి చెప్పే వ్యక్తికన్నా ఎక్కువ ప్రజ్ఞ కలవాడయి ఉండవచ్చు'** అన్ని అన్నారు.

కాబట్టి ఇస్లాం గురించి మీకు తెలిసింది ఒకే ఒక్క విషయమయినా పరవా లేదు; దాన్నే ఇతరులకు చేరవేయండి. అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు:

"అల్లాహ్ వైపు (జనులను) పిలుస్తూ, సత్కార్యాలు చేస్తూ, **'నిశ్చయంగా నేను ముస్లింల (విధేయుల)లోని వాడను'** అని (ఆత్మవిశ్వాసంతో) పలికే వాని మాటకంటే మంచి మాట మరెవరిది కాగలదు?".

(దివ్యఖుర్ఆన్-41:33)

ధార్మిక విద్యార్జన:

అల్లాహ్ అంతిమ ప్రవక్త ముహమ్మద్ (స) వారిపై అవతరించిన తొలి దైవవాణికి సంబంధించిన అయిదు సూక్తుల్లో జ్ఞాన సముపార్జన ప్రాముఖ్యతను నొక్కి వక్కాణించాడు: **"చదువు నిన్ను పుట్టించిన నీ ప్రభువు పేరుతో. ఆయన మనిషిని గడ్డ కట్టిన రక్తంతో పుట్టించాడు. చదువు, నీ ప్రభువు ఎంతో దయాళువు. ఆయనే మనిషిని కలంద్వారా జ్ఞానాన్ని నేర్పినవాడు. మనిషికి తెలి యని జ్ఞానాన్ని బోధించాడు".** (అలఖ్ 1-5) మన ప్రియ ప్రవక్త ముహమ్మద్ (స) ఇలా సెలవిచ్చారు: **"జ్ఞాన సముపార్జన ప్రతి ముస్లిం (స్త్రీపురుషుని)పై తప్పనిసరి విధి".**


నేనేం చదవాలి?



ఇస్లాం మౌలికాధారాల గురించి, ఈమాన్ మౌలికాంశాల గురించి, దైనందిన జీవితానికి సంబంధించిన దినచర్యల గురించి, నీతి, నడవడిక, న్యాయం గురించి, కుటుంబ జీవనం, వివాహం, హరామ్, హలాల్-ఇత్యాది విషయాల గురించి కనీస ధార్మిక జ్ఞానం మీకుండాలి. అదెలా సాధ్యం అంటే, ఇస్లాం ధర్మానికి మూలం రెండు విషయాలు. వాటిని గురించి తెలియజేస్తూ దైవ ప్రవక్త (స) ఇలా సెలవిచ్చారు: **"నేను మీలో రెండు విషయాలను వదలి వెళుతు న్నాను. మీరు వాటిని గట్టిగా పట్టుకున్నంత కాలం మార్గం తప్పరు. వాటిలో ఒకటి అల్లాహ్ గ్రంథం అవగా, రెండవది నా సంప్రదాయం (సున్నత్)".**

పవిత్రఖుర్ఆన్ పారవశ్య పారాయణం, హదీసు శ్రావ్యశ్రవణం

అల్లాహ్ మానవాళి మీద దయదలిచి వారి ఇహపరాల సాఫల్యం కోసం తన ప్రత్యేక కరుణ ద్వారా అవతరింపజేసిన మహిమాన్విత గ్రంథం ఖుర్ఆన్. **'ఖుర్ఆన్ పారాయణం వల్ల, మనస్సులు నెమ్మదిస్తాయని, ఆత్మజ్యోతి రగులుకుంటుందని, ఐహిక వాంఛల వల్ల హృదయానికి పట్టిన తుప్పు తొలిగిపోతుందిని, ప్రళయ దినాన అది తనను పారాయణం చేసే వారి విషయంలో సిఫారసు చేస్తుందని, దాని సిఫారసును అల్లాహ్ అమోదిస్తాడని, జాతుల సౌభాగ్య, దౌర్భాగ్యం, అదృష్టదురదృష్టాలు ఖుర్ఆన్‌తోనే ముడిపడి ఉన్నాయని'** దైవ ప్రవక్త (స) వివిధ సందర్భాల్లో సెలవిచ్చి ఉన్నారు. కాబట్టి ఆ భాగ్యాన్ని సొంతం



చేసుకునే సంకల్పంతో ప్రతి రోజు ఖుర్‌ఆన్ చదివి తన్మయం చెందేందుకు పది నిమిషాలు కేటాయించండి. ఖుర్‌ఆన్‌ను అరబీలోగానీ, అనువాదంగాని చదవగలిగితే చాలా మంచిది. ఒకవేళ చదవడం, వ్రాయడం రాకపోతే ఖుర్‌ఆన్ పారాయణాన్ని, అనువాదాన్ని విని తరించేందుకు ప్రయత్నించండి. **'ఖుర్‌ఆన్ చదవడం నేర్చుకుని ఇతరులకు నేర్పించే వ్యక్తి మీలో ఉత్తముడు', ఖుర్‌ఆన్ విద్యలో ప్రావిణ్యం సంపాదించుకున్న వ్యక్తి మిక్కిలి గౌరవనీయులైన దైవ దూతల సరసన ఉంటాడు'** అని అన్నారు దైవ ప్రవక్త (స). కాబట్టి ఖుర్‌ఆన్‌ను అది అవతరించిన భాషలో –అరబీలో చదివేందుకు శక్తివంచన లేకుండా అవిశ్రాంతంగా ప్రయత్నించండి. ఎందుకంటే ఖుర్‌ఆన్ అరబీ భాషలో చదివేటప్పుడు కలిగే మధురానుభూతియే వేరు. అలాగే మీ ప్రాంతీయ భాషలో గల ఇస్లామీయ సాహిత్యం చాలా పరిమితమయినది. మీరు ఆధ్యాత్మికంగా పరిణతి చెందాలన్నా, మీలో విశ్వాసం రీత్యా పరిపక్వత రావాలన్నా అరబీ భాషను నేర్చుకోవడం ఎంతో అవసరం.

మస్జిద్ - ప్రార్థనాలయం



"ఓ ఆదం సంతివారలారా! మీరు మస్జిద్‌కు హాజరయిన ప్రతిసారీ వస్త్రాలంకరణ పట్ల శ్రద్ధ వహించండి". (అల్ ఆరాఫ్:31) అని అంటున్నాడు అల్లాహ్.

"మస్జిద్‌లో సామూహికంగా చేసే నమాజు ఒంటరిగా చేసే నమాజు కన్నా 27 రెట్లు ఎక్కువ పుణ్యాన్నిస్తుంది" అన్నారు ప్రవక్త (స).

మస్జిదులు అల్లాహ్ అతిథి గృహాలని, వాటిలో హాజరయ్యేవారికి స్వర్గంలో అతిథి సత్కారాలు దక్కుతాయని, అవి అల్లాహ్‌కు ఎంతగానో నచ్చిన ప్రదేశాలని, స్వర్గ వనాలని, వాటి గుండా వెళితే తనివితీరా వాటి ఫలాలను భుజించండి (సుబ్హానల్లాహ్, అల్ హమ్దు లిల్లాహ్, అల్లాహు అక్బర్ అంటూ నిత్యం దైవాన్ని కొనయాడుతూ ఉండండి) అని, మస్జిద్‌కు వెళ్ళేవారు దైవ కారుణ్య జలధిలో నిండు స్నానాలు చేస్తుంటారని, వారు దైవమార్గంలో పోరాడే యోధులతో సమానమని, మస్జిద్‌కు వెళ్లేవారిని అల్లాహ్ అన్ని విధాల నష్టాల నుండి కాపాడతాడని, నిత్యం మస్జిద్‌కు వచ్చే వ్యక్తి, ముస్లిం అని సాక్ష్యమివ్వమని, ఇంటి నుండి చక్కగా వుజూ చేసుకుని మస్జిద్ వైపునకు వచ్చే వ్యక్తి ప్రతి అడుగుకి ఒక్కో పాపం హరించడంతో పాటు, అతని ఒక్కో అంతస్థు పెచబడుతుందని, (నిరతం తన హృదయాన్ని మస్జిద్‌తో ముడిపెట్టుకునే వారికి ప్రళయ దినాన అల్లాహ్ అర్ష్ నీడ ప్రాప్తిస్తుందని, వాటిని నిర్మించిన వారికి, వాటి నిర్మాణంలో పాలు పంచుకున్న వారికి మహా గొప్ప పుణ్యం లభిస్తుందని, వాటి సంరక్షణ కోసం పాటు పడాలని దైవ ప్రవక్త ముహమ్మద్ (స) వారి పలు ప్రవచనాల ద్వారా రూఢి అవుతుంది. 'ఇషా నమాజు జమాతుతో చదివి, ఫజ్ర్ నమాజు కూడా జమాతుతో చదివిన వ్యక్తి ఆ రాత్రంతా నమాజు చేసినంత పుణ్యం లభిస్తుందని' సయితం ప్రవక్త (స) వారు సెలవిచ్చి ఉన్నారు. కాబట్టి మనం మస్జిద్‌లను ప్రేమించాలి. వీలయినంత వరకు నమాజులన్నీ మస్జిద్‌లోనే చదివేందుకు ప్రయత్నించాలి.

'నిశ్చయంగా నమాజు వేళకు విధిగా విశ్వాసులపై ఖరారు చేయబడింది' (అన్నిసా: 103) అని అల్లాహ్ సెలవిచ్చాడు గనక మనం నమాజును వేళకు మస్జిద్‌కెళ్లి చేసేందుకు కృషి చేయాలి.

ఇస్లాం మౌలికాధారాల గురించి, ఈమాన్ మౌలికాంశాల గురించి, దైనందిన జీవితానికి సంబంధించిన విషయాల గురించి, నీతి, నడవడిక, న్యాయం గురించి, కుటుంబ జీవనం, వివాహం, హరామ్, హలాల్-ఇత్యాది విషయాల గురించి కనీస ధార్మిక జ్ఞానం మనకుండాలి.

వ్యక్తుల సంస్కరణకు, వారి ధార్మిక ప్రాంచిక శ్రేయోసాఫల్యాలకు కేంద్ర స్థానం మస్జిద్. మానవ చరిత్ర ఎంత పురాతనమయినదో దానికన్నా ప్రాచీనమై నది మస్జిద్ చరిత్ర. దాని నిర్మానుద్దేశ్యం ఏకేశ్వరోపాసన అయినప్పటికి, కక్షలూ, కార్పణ్యాలను, కలతలూ, కలహాలను అంతం చేయడానికి మస్జిద్‌లు దివ్య వ్యవస్థగా అలరారుతూ వచ్చాయన్నది నిర్వివాదాంశం. ఇంకా చెల్లాచెదురయి ఉన్న మానవ రాసికి చెందిన ఆణిముత్యాలను ఏర్చికూర్చి విశ్వప్రభువు యొక్క పవిత్ర సన్నిధిలో అందరినీ ఒకే పంక్తిగా, ఒకే సమూహంగా నిలబెట్టి లోకశాంతి సాధన కోసం ఆత్మశాంతి ప్రబోధనా క్షేత్రాలు మస్జిద్‌లు.

నిజంగా మస్జిద్‌లో నమాజు చేసేటప్పుడు కలిగే మహదానందమే వేరు. ప్రశాంత వాతావరణంలో నమాజు చేస్తాము గనక మనసు నెమ్మదిస్తుంది. అందరం కలిసి మెలిసి నమాజు చేస్తాము గనక పరస్పర సోదర భావం, సమైక్యత, సహిష్ణుత, త్యాగం, సహకారభావం పెరుగుతుంది. మన సంబంధబాంధవ్యం మస్జిద్‌తో బలపడితే ముస్లిం సమాజంతో సయితం బలపడినట్లే. అలాగే, **'మీ ఇళ్ళను స్మశానాలుగా చేయకండి'** అని ప్రవక్త (స) వారు హెచ్చరించి ఉన్నారు. కాబట్టి ఇంటి వారిని నమాజు చేయమని ఆజ్ఞాపించడంతో పాటు, మనము సయితం నఫిల్ నమాజుల్ని ఇంట్లో చేసేందుకు ప్రయత్నించాలి.

(ఇంకా ఉంది)



నరక కూపం

నూరా తబస్సుమ్

"మరి ఎవరయితే హద్దులు మీరి ప్రవర్తించి ఐహిక జీవితానికే ప్రాధాన్యమిచ్చారో వారికి నరకమే నివాసమవు తుంది".

(నాజిఆత్: 37-39)

ఎందరో మరణించారు. మరెందరో మరణ దూత వేయిటింగ్ లిస్టు లో ఉన్నారు. మనమందరం ఏదోక రోజు మరణించవలసిన వారమే. మనందరి శ్వాస ఏదోక రోజు ఆగిపోతుంది. మనమే కాదు ఈ పుడ మిపై మనుగడ సాగిస్తున్న ప్రతి ప్రాణికి మరణం ఉంది, ప్రతి వస్తువు కు నాశనం ఉంది. నిన్నటి వరకూ మనతో పాటు ఎందరో పరిచి తులు-అపరిచితులుండేవారు. వారిలో ఒకడు ప్రేమ కావాలనేవాడు, ఒకడు పెళ్ళి కావాలనేవాడు. ఒకడు ఖారూన్ అంతటి ఆస్తి ఉండా లని, బిల్‌గెట్స్ అంతటి ఎత్తుకు ఎదగాలనుకునేవాడు. అయితే వీరిలో ఎందరి ఆశలు ఫలించాయో ఎందరి ఆశలు ఆడియాశలయ్యాయో ఆ దేవుడికే ఎరుక. ఏదిఏమయినా అందరి విషయంలో ఆ దేవుని మాట నిజమయింది: **"ప్రతి సముదాయానికి ఒక గడువు నిర్ణయ మయి ఉంది. ఆ గడువు పూర్తి అయినప్పుడు ఒక్క ఘడియ కాలం కూడా వెనకా ముందూ అవడం అనేది జరగదు".** (ఆరాఫ్: 34) మృత్యువు వారిని మెల్లగా తన ఒడిలోకి తీసేసుకుం టుంది.....

మనిషి చనిపోతాడు. పాము కుబుసం వదలి ముందుకు సాగిపో యినట్టు ఎంతో నాజుకూగా పెంచుకున్న గారాల దేహాన్ని వీడి మనిషి ఆత్మ పరలోకానికి పయనమవుతుంది. దానికి భౌతిక నేత్రాలయితే లేవుగానీ అది చూడగలుగుతోంది. దానికి మనకులాగు వీనులు లేవు గానీ, అది వినగలుగుతుంది. నరకం ఉందంటే నరలోకాన్నే నాకంలా భావించే కొందరు భ్రమ జీవులు ఎగిరి గంతులేస్తారు. కోపంతో కారాలు మిరియాలు నూరుతారు. సమాధి చేయబడిన శవం మట్టిలో కలిసి మట్టయిపోతుందనుకుంటారు. కాల్చబడిన శవం బూడిదయి కాటి మట్టిలో కలిపోతుందనుకుంటారు. ఐహిక జీవితం తప్ప పర లోక జీవితం లేదన్నది వీరి బలమయిన వాదన. దేహంకన్నా ఆత్మ కున్న ప్రాముఖ్యతను వీరు గమనించేందుకు సుముఖంగా ఉండరు. శరీరానికి మెరుగులు దిద్దుకుంటారేగానీ, ఆత్మను ప్రక్షాళనం చేసుకు నేందుకు ప్రయత్నించరు. దాని గురించి ఆలోచించనన్నా ఆలోచిం చరు. సమాధి యాతన అనేది ఎంత నికృష్టమయినదో, అక్కడికి చేరిన ఆత్మలు ఎంతగా అల్లాడిపోతాయో, సమాధిలో పుణ్యాత్మలకు లభించే ఫలం ఎంత మధురాతిమధురమయినదో, అవి ఎంతటి సుఖవంత మయిన జీవితాన్ని అక్కడ గడుపుతాయో పూస గుచ్చినట్లు ప్రవక్త (స) వారు చెప్పినా మారని ఈ జనం నిజంగా సమాధికేగిన ఆత్మ ల్లోని ఏ ఒక్క ఆత్మ అయినా తిరిగి భూవాసుల వద్దకు పోయి వివరించినా మారుతారన్న గ్యారంటీ లేదు. ఎందుకంటే అది వారి అనుభ వంలోనికి రానిది గనక. అయినా అలా జరగడానికి వీలు లేదు. అలా వెళ్ళాలని కోరుకోని వారు ఉండరని కాదు అర్థం; ఉంటారు. కానీ వారికి లభించే సమాధానం ఏమిటి?

"ఏమిటీ, మేము మట్టిలో కలిసి, మాయమయిపోయిన తర్వాత కూడా మళ్లీ సరికొత్తగా సృష్టించబడతామా?" అని వారు అంటారు. అసలు విషయం ఏమిటంటే వారు తమ ప్రభువును కలుసుకోవటాన్ని త్రోసి పుచ్చుతున్నారు. **(ఓ ప్రవక్తా!) వారికి చెప్పు: "మీపై నియమించ బడివున్న మృత్యుదూత మీ ప్రాణాలను వశపర్చుకుంటాడు. ఆ తర్వాత మీరంతా మీ ప్రభువు వైపునకు మరలించబడతారు. అపరాధులు తమ ప్రభువు సమక్షంలో తలలు వంచుకుని ఉండటాన్ని నువ్వు చూస్తే ఎంత బాగుండు! (అప్పుడు వారిలా అంటారు)'మా ప్రభూ! మేమంతా చూసుకున్నాము. (అంతా) వినేశాము. ఇక మమ్మల్ని తిరిగి పంపించు. ఇక నుంచి మేము సత్కార్యాలు మాత్రమే చేస్తాము. మాకిక పూర్తి నమ్మకం కలిగింది."**

(అస్సజ్దా: 10-12)

ఒకప్పుడు వారు త్రోసి పుచ్చిన విషయాల్ని ఇప్పుడు కళ్ళారా చూసు కుంటారు. ఒకప్పుడు పరహసించిన వాటిని గురించి ప్రత్యక్షంగా వింటారు. అల్లాహ్ హెచ్చరికలోని వాస్తవికత వారికి బోధ పడతుంది. ప్రవక్తలు (అ) తెలియజేసిందంతా సత్యమని అప్పుడు వారికర్థమవు తుం ది. కానీ, ఏం లాభం? కర్మలు చేసుకోవడానికి వారికివ్వబడిన గడువు తీరిపోయింది. ఇప్పుడు వారి కోసం మిగిలిందల్లా పరాభావం తో కూడిన శిక్షే వారు ప్రాపంచిక జీవితంలో దైవాన్ని, ఆయన శాస నాల్ని, ఆయన పంపగ వచ్చిన ప్రవక్తల ప్రవచనాల్ని పెడ చెవిన పెట్టారు, ఖాతరు చేయలేదు, విస్మరించారు. కాబట్టి ఈ రోజు అల్లాహ్ కూడా వారి గోడును పట్టించుకోడు.

మనిషి మరణం తర్వాత ఎన్నో మజిలీలు ఉంటాయి. సమాధి పర లోకపు తొలి మజిలీ అయితే మహ్షర్ అనే చివరి మజిలీలో ఎక్కడి వెళ్ళాలో తీర్పు ఇవ్వబడుతుంది.

"ఓ బృందం స్వర్గంలో, మరో బృందం నరకంలో". (షూరా:7)

ఒక సోదరుడేమో ఆటపాటలే జీవితమని తలపోస్తున్నాడు. మరొక మిత్రుడు దైవాదేశాలనకు శిరసావహించడమే, ఆయన్ను ఆరాధించ డమే జీవిత అర్థంగా, పరమార్థంగా భావిస్తున్నాడు. ఒక సోదరు డేమో అశ్లీల కార్యాల్లో, నీతిమాలిన పనుల్లో ఖర్చు పెట్టేందుకు ధనాన్ని కూడబెడుతున్నాడు. ధనమే మనిషిని నడిపే ఇంధనం అని నమ్ముతు న్నాడు. తనకు ప్రాప్తయిన సిరిసంపదలు కలకాలం ఉంటాయయనీ, వాటి ప్రాపిపదికనే కీర్తిప్రతిష్టతలు ఒనగూడుతాయని భావిస్తున్నాడు. మరొక మిత్రుడు అల్లాహ్ మార్గంలో ఖర్చు పెట్టాలనీ, తల్లిదండ్రుల సేవలు చేయాలని, అనాథలను, నిరుపేదలను, వికలాంగులను, వితం తువులను ఆదుకోవాలనీ, నిస్సహాయులకు, నిరాధార జీవులకు అండ గా నిలవాలనీ, బంధుమిత్రులతో, ఇరుగుపొరుగువారితో సత్సంబం ధాలు పెంపొందించుకోవాలనీ ధర్మం సమ్మతించిన పద్ధతిలో ధనాన్ని అర్జిస్తున్నాడు.

ఒక సోదరుడేమో – విదేశాలకు వెళ్ళి విలాసాల్లో, కులాసాల్లో గడుపుతూ, అక్కడ హాయిని పొందాలని, బులపాటం తీర్చుకోవాలని, మదుపానం మైకంలో మునిగి తేలాలని కోరుకుంటున్నాడు. మరొక మిత్రుడు – హజ్జ్–ఉమ్రాల కొరకు మక్కా వెళుతున్నాడు. ఆఫ్రికన్ దేశాలలో నివసిస్తూ కటిక దారిద్ర్యాన్ని అనుభవిస్తున్న అభాగ్యుల వద్ద కెళ్ళి రేయింబవళ్ళు వారి సేవలోనే సమయం గడుపుతున్నాడు. దైవాభీష్టానికి అనుగుణంగా జీవించి శ్వాస వదలాలని సుదూర ప్రయాణాలు చేస్తున్నాడు. ఇలా భిన్న దృక్పథాలు గల ఈ ఇరువురూ సమానులేనా? కారు...ఎన్నటికీ కాలేరు. అవును ఇది అక్షర సత్యం –

"నరకానికి ఆహుతి అయ్యేవారు, స్వర్గానికి పోయేవారు సమానులు కాలేరు". (హష్ర్:11)

నిజ దైవాన్ని గ్రహించి, మిథ్యా దైవాలను విడనాడమని, అయిదు పూటల నమాజు పాటించమని, జకాత్ చెల్లించమని, శాంతిని సర్వ వ్యాప్తం చేయమని, అన్నదానాలు చేపట్టమని మనిషికి పలు విధాలుగా బోధించడం జరిగింది. **"కాని అతను తిరస్కరించాడు. పరిహసించాడు. పరలోక జీవితముందని అంగీకరించలేదు. ఆపై సత్య మార్గానికి వ్యతిరేకంగా పన్నాగాలు పన్నటానికి వెళ్ళిపోయాడు".** **(ఖియామా)** రేపు ప్రళయ దినాన అల్లాహ్ ఇదే మనిషినుద్దేశించి (ఇక్కడ ముగ్గురు పండితులున్నారు) – **"ఓ మానవుడా! నేను మీకు ఆరోగ్యవంతమయిన శరీరాన్ని ఇవ్వలేదా! కాని మీరు ఈ శరీరాన్ని నా ప్రసన్నతను బడసే మార్గంలో ఉపయోగించ లేదు"** అంటాడు. **వారిలో ఒకడికి** అప్పుడు గుర్తుకొస్తుంది. తను చేసిన పాపాలన్నిం టిని తలచుకుంటాడు. నీతిని గురించి, న్యాయాన్ని గురించి ఊక దంపుడు ఉపన్యా సాలు ఇచ్చానేగానీ, ఏనాడయినా పిసరంతయినా పాటించిన పాపానికి పోలేదు. నాదంతా వేషధారణ బ్రతుకు. భూ లోకంలోనేగానీ ఇక్కడ అబద్దమాడి తప్పించుకునేందుకు లేదు. సంగీత దర్శకులు, సినీ దర్శకులు, నటులు, నటీమణులు, కలిమి బలిమి గలవాళ్ళెందరో నా వద్దకొచ్చి ఆశీర్వాదం పొంది వెళ్ళే వారు. ఓ మోస్తరు తప్పు చేసేవారు కూడా నన్ను చూసి వణికిపోయే వారు. నేను మాత్రం రహస్యంగా పాపాలకు పాల్పడి ఏమీ ఎరుగని వాడిలా నటించేవాడిని. ప్రసంగాల్లో బహుదైవారాధన ఎంత ఘోర మయిన పాపమో శ్రోతల హృదయాలు కంపించిపోయేలా గద్దించే వాడిని. కానీ బహిరంగంగానే దర్గాహ్ (సమాధి)పై పీఠాధిపతినయి కూర్చునేవాడిని. ఫాతెహాలు, పది మంది స్త్రీల కహానీలంటూ ప్రజలను భ్రష్ట పట్టించడమే కాక వారి సంపదను కొల్లగొట్టేవాడిని. భార్యాభర్త లెలా సఖ్యతగా మెలగాలనే విషయంపై ఉద్దండ ఉపన్యశించి ఇంటి కెళ్ళినప్పటి నుండి భార్యతో తిట్ల తాంబూలాలు, కొట్లాటలు. అతని ప్పుడు రక్త కన్నీరు కారుస్తున్నాడు; కాని ఫలితం లేదు.

మరో మనిషి – తనో మహా సంఘ సేవకుడని, అనాథలకు ఆశ్రయం వంటి వాడని, విధవరాళ్ళను, వయస్సుడిగిన వారికి ఆపద్భాంధవుడి లాంటి దాతని, మహా నేత అని అతన్ని జనాలు పొగిడారు. ఉదయ మొక దేశంలో, మధ్యాహ్నం మరొక దేశంలో, రాత్రి ఇంకొక దేశంలో భోంచేశాడు. విదేశాల్లో కూడా తన వాగ్ధాటికి, పవిత్ర జీవనానికి, వాక్యపరిచర్యకు గులాములయిన వారు కోకొల్లలు. వేల సంఖ్యలో అభి మానులు సభలకు హాజరయ్యేవారు. ఆంగ్లంలో ఏక ధాటిగా ఉపన్యా సాలివ్వడమే కాక, ప్రముఖులు ఆంగ్లంలో ఇచ్చే ప్రసంగాలకు అను వాదకుడిన వ్యవహరించి ఆయా వ్యక్తుల మన్ననలు పొందేవాడు. ఎన్నో ఇళ్ళ స్థలాలు, పొలాలు, పేటకొక భవనం అంతా దేవుని అనుగ్రహం అన్న అతి వినయం ఒకటి.

ఇంకో మనిషి– వర్ణ విభేదాలు, కుల రచ్చలు, జాతి వైషమ్యాలు ఎందుకు చేసినట్టో? అతని ఇప్పుడే అర్థమయింది. తాను చెడింది గాక ఇతరులెందరినో చెడగొట్టాడు. సృష్టితాలను దైవ స్వరూపాలుగా, దైవాంశ సంభుతులుగా, దైవ అవతరాలుగా చిత్రీకరించి వాటినే పూజించాలని, అదే సనాతన మతం అని మాయమాటలు చెప్పి, అభూత కల్పనలను జోడించి, పుక్కిటి పురాణాలను వ్యాపింపజేసి యుగాల తరబడి మోసగించిన నేరం అతనిది.

రొజుకో బూటకపు దైవాన్ని సృష్టించడం అతనికో ఆట. ఒక దేవునితో బోరు కొడితే వెంటనే మరో దేవుడ్ని ప్రతిష్టింపజేసేవాడు. సింహం, ఏనుగు, శునకం, వరహం కూడా దేవుళ్ళే. అతని వినోదం దేవతను సృష్టించడం. దేవుడొక్కడేనని, ఆయన అద్వితీయుడని, దేశకాలలకు పరిమితం కానివాడని, అవ్యక్త రూపుడయిన ఆయనను పాంచ భౌతి కారముగా తలంచి పూజించే వారు శుద్ధ అవివేకులని, మానవులంతా ఒక్కటేనేనని, ఒకే దేవుని దాసులని, సల్లవారికి తెల్లవారిపైగానీ, తెల్ల వారికి సల్లవారిపైగానీ ఎలాంటి ఆధిక్యత లేదు దైవభీతితో తప్ప అని దైవప్రవక్తలు ప్రబోధించినా, దైవగ్రంథాలు ప్రకటించినా అతను లెక్క చేయలేదు. అతని స్వార్థం, మూర్ఖత్వం, మూడ విశ్వాసాలే నేడు అత నిని భయంకర నరకానికి ఆహుతి చేశాయి. ఇక్కడి నుండి తను వెళ్ళ లేడు. తనలాంటి వారికి ఈ యదార్థాన్ని చెప్పి సంస్కరించాలన్న కోరిక బలంగా ఉన్నా అది సాధ్య పడదు. ఈ విషయం తెలిసిన అతను విలవిల్లాడిపోతూ తన చేతలను కొరుక్కుంటూ: **"అయ్యో! నేను దైవ ప్రవక్తను అనుసరించి ఉంటే ఎంత బాగుండేది! అయ్యో నా దౌర్భాగ్యం! నేను ఫలానా వ్యక్తితో స్నేహం చేయ కుండా ఉంటే ఎంత బాగుండేది! అతని మాయామాటల్లో పడి నేను నా వద్దకు వచ్చిన హితబోధను స్వీకరించలేదే!" (ఫుర్ఖాన్: 28,29)**అంటూ కుమిలిపోతున్నాడు. ఆ తర్వాత ఏం జరుగుతుంది?

"సత్యాన్ని తిరస్కరించిన వారు నరకం వైపునకు గుంపులు గుంపులుగా తోలబడతారు. చివరకు వారు అక్కడ చేరిన ప్పుడు దాని ద్వారాలు తెరుచుకుంటాయి". (జుమర్: 71)

నరకం – దానికి ఏడు ద్వారాలు. **"ఆ రోజు నరకం ముందుకు తీసుకు రాబడుతుంది. ఆ దినమున మానవుడు తాను చేసుకున్నదంతా జ్ఞాపకం తెచ్చుకుంటారు".** (ఫజ్ర్:23, 24) **"అయ్యో నా కర్మల పత్రం నాకు అసలు ఇవ్వబడకుండా ఉంటే, నా లెక్కే మిటో నాకు అసలు తెలియకుండా ఉండి ఉంటే ఎంత బాగుండేది".** (హాఖ్ఖహ్:25-27) అని వాపోతాడు. ఏదోక రోజు నేను చేసిన ప్రతి దానికీ లెక్క చెప్పుకోవాల్సి వస్తుందని నేను ఏ మాత్రం ఆలోచించలేదే! **"అయ్యో! నా ఆ మరణమే అంతిమ మరణ మయి ఉండి ఉంటే ఎంత బావుండేది. నా ఆస్తిపాస్తులు నాకేవిధం గానూ పనికి రాలేదే! నా అధికారమంతా అంతరించి పోయిందే!"** (27,28) అయ్యో నా సైన్యం ఏమయింది? నా ఆజ్ఞను పాలించే వారు ఏమయ్యారు. నా కీర్తికండూతి ఎక్కడా? ఏ ఇంటి నిర్మాణం కోసం పేదల కడుపులు కొట్టానో, ఏ భార్యాపిల్లల కోసం అహిర్నిశలు అవినీతి అక్రమార్కుడిలా వ్యవహరిం చానో, ఏ బూటకపు గౌరవం కోసం అఘాయిత్యాలకు పాల్పడానో వారంరూ ఇప్పుడేమయ్యారు?అని రోధిస్తాడు. కాని అతని రోధన అరణ్య రోధనే అవుతుంది. అల్లాహ్ ఆజ్ఞ జారి చేయబడుతుంది: **"అతనిని పట్టుకోండి. అతని మెడకు కంఠపాశం తగిలించండి. ఆపైన అతన్ని నరకంలో విసిరి వేయండి. అతన్ని డైబ్భై గజాల పొడుగు గల గొలుసుతో బంధించండి".**

(హాఖ్ఖహ్:30, 32) **(ఇంకా ఉంది)**

సద్వర్తనులైన పరిపాలకులు
ఖులఫాయె రాషిటీన్

ప్రథమ ఖలీఫా అబూ బకర్ (ర)

హజ్రత్ అబూ బకర్, హజ్రత్ ఉమర్, హజత్ ఉస్మాన్, హజ్రత్ అలి (రజియల్లాహు అన్హుమ్) – వీరినే ఖులఫాయె రాషిదీన్ – సద్వర్తనులైన పరిపాలకులు అనంటారు. దైవ అంతిమ ప్రవక్త ముహమ్మద్ (స) వారి మరణా నంతరం వీరు అల్లాహ్ ఆదేశాలను, ఆయన ప్రవక్త సంప్రదాయాలను అమలు పర్చారు. వాటి ప్రాతిపదికన పరిపాలించారు. ధర్మ సంస్థాపనలో, న్యాయ వ్యవస్థ స్థాపనలో, ఇస్లాం ధర్మ ప్రచారంలో వీరు పోషించిన పాత్ర, పడిన శ్రమ అమోఘమైనది. ఈ నలుగురు ఖలీపాల పరిపాలనా కాలం దాదాపు 30 సంవత్సరాలు. అది హిజ్రీ శకం 11 నుండి ప్రారంభమయి హిజ్రీ శకం 40 వరకూ. దైవ అంతిమ ప్రవక్త ముహమ్మద్ (స) ఇలా ప్రవచించారు: **"నా సముదాయంలో ఖిలాఫత్ (పరిపాలన) 30 సంవత్సరాలు ఉంటుంది".**

(తిర్మిజీ)

మొదటి ఖలీఫా హజ్రత్ అబూ బకర్ (ర)పేరు - వంశావళి: అబ్దుల్లాహ్ బిన్ ఉస్మాన్ బిన్ ఆమిర్ అత్తయిమీ అల్ ఖర్షీ–అబూ బకర్ నామాంతరంతోనే ఆయన ప్రసిద్ధి చెందగా. ఆయన తండ్రి ఉస్మాన్, అబూ ఖహాఫా పేరుతో ప్రసిద్ధి చెందారు.

బయోడెటా

ఏనుగుల సంవత్సరం తర్వాత రెండేళ్ళకు జన్మించారు. దైవ దౌత్యానికి పూర్వం తర్వాత ప్రవక్త ముహమ్మద్ (స) వారి ప్రాణ మిత్రులుగా ఉన్నారు. పురుషుల్లో అందరికన్నా ముందు ఇస్లాం స్వీకరించారు. ఆయన గొప్ప శ్రీమంతులవ్వడంతోపాటు మంచి వ్యాపారవేత్త కూడా.

హజ్రత్ అబూ బకర్ (ర) గారి విశిష్టత

అల్లాహ్ హిజ్రత్ సందర్భంగా హజ్రత్ అబూ బకర్ (ర)ను తోడు తీసుకోవలసిందిగా మహా ప్రవక్త ముహమ్మద్ (స) వారిని ఆదేశించాడు. గుహలో ఆయన కలత చెందినప్పుడు అభయమిస్తూ సూరాతౌబాలోని 40వ ఆయతును అవతరింపజేశాడు. మహా ప్రవక్త ముహమ్మద్ (స) వారితో అన్ని యుద్ధాల్లోనూ ఆయన పాల్గొన్నారు. దైవ ప్రవక్త ముహమ్మద్ (స) వారి మరణం వరకూ ఆయనకు తోడుగా, కుడి భుజంగా ఉన్నారు. ఇహలోకంలోనే స్వర్గపు శుభవార్తను అందుకున్న పది మంది సౌభాగ్యవంతుల్లో ఆయన ఒకరు. దైవప్రవక్త ముహమ్మద్ (స) చివరి ఘడియల్లో ఇమామత్ చేయవలసిందిగా ఆయన్ను ఆదేశించారు.

ఖలీఫా బహువచనం ఖులఫా – ప్రతినిధి

రాషిద్ బహువచనం రాషిదూన్ – సద్వర్తనుడు

ప్రశ్నోపనిషత్తు

1) ఖులాఫాయె రాషిదీన్ అని ఎవరెవరిని అంటారు? వారి పరిపాలనా కాలం ఎంత?
2) అబూబకర్ (ర) గారి వంశావళిని పేర్కొనండి?
3) హజ్రత్ అబూ బకర్ (ర) నామాంతరం ఏమిటి?
4) ఆయన్ను సిద్దీఖ్ అన్న బిరుదు ఎందుకు వరించింది?
5) దైవ ప్రవక్త (స) మరియు అబూబకర్ ఇద్దరిలో ఎవరు పెద్ద? వారిరువురి వయసు వ్యత్యాసం ఎంత?
6) అబూ బకర్ (ర) ఇస్లాం స్వీకరించిన నాటికి ఆయన వయసు ఎంత?
7) ఆయనకు సంబంధించిన ఐదు మంచి గుణాలను పేర్కొనండి?
8) వ్యాసంలో మీకు చెప్పబడిన విషయాలను మినహాయించి మీకు ఆయన గురించి ఏమి తెలుసు?
9) సర్గపు శుభవార్త పొందిన ఆ పది మంది సౌభాగ్యవంతులు ఎవరు?

ఖిలాఫత్ శపథం

దైవప్రవక్త ముహమ్మద్ (స) తన తర్వాత ప్రతినిధిగా ఎవ్వరినీ ఖరారు చేయలేదు. ఈ కారణంగా ఆయన (స) మరణానంతరం అన్సార్లంతా బనూసాద్ మహల్లాలోని ఓ మండపంలో ప్రోగయ్యారు. అదే సమయంలో అక్కడికి ముహాజిర్లు కూడా వచ్చారు. వారిలో హజ్రత్ అబూ బకర్, ఉమర్, అబూ ఉబైదా (ర) కూడా ఉన్నారు. ప్రవక్త (స) వారి తర్వాత ఎవరిని ఖలీఫాగా ఎన్నుకోవాలన్న మీమాంస వచ్చినప్పుడు హజ్రత్ అబూబకర్ (ర) గారు హజ్రత్ ఉమర్ మరియు అబూ ఉబైదాను ఉద్దేశించి వీరిద్దరిలో ఎవరినయినా ఖలీఫాగా ఎన్నుకోండి అని సలహా ఇచ్చారు. కానీ ఉమర్ (ర) గారు ముందుకొచ్చి హజ్రత్ అబూ బకర్ (ర) గారి చేతి మీద బైఅత్ – శపథం చేశారు. తర్వాత హజ్రత్ అబూబకర్ (ర) గారి అంగీకారంతో అక్కడున్నవారందరూ బైఅత్ చేశారు. రెండవ రోజు మస్జిదె నబవీలో ప్రోగయి అందరూ మళ్ళీ బైఅత్ చేశారు. తర్వాత ఆయన్ను ఖలీఫతుర్రసూల్, ఖలీఫతుల్ ముస్లిమీన్ అన్న బిరుదిచ్చారు. ఎందుకంటే ఆయనే ఇకమీదట ముస్లింలందరికి అధినాయకుడు గనక. ఈ సందర్భంగా ఆయన ప్రజలనుద్దేశించి ఇలా అన్నారు:

"ప్రజలారా! నన్ను మీపై అధినాయకుడిగా చేయడం జరిగింది. నిజమే మిటంటే నేను మీకన్నాగొప్పవాణ్ణి మాత్రం కాను. ఒకవేళ నేను మంచి చేస్తే మీరు నాకు వెన్నుదన్నుగా నిలవండి. ఒకవేళ నేను చెడు మార్గాన నడిస్తే మీరంతా కలిసి నన్ను సంస్కరించాలి.సత్యం ఒక అప్పగింత. అసత్యం ఒక మోసం. మీ దృష్టిలో బలహీనుడయిన వ్యక్తి నా దృష్టిలో బలవంతుడు; అతని హక్కును అతనికిప్పించనంత వరకు. మీ దృష్టిలో బలవంతుడయినవాడు నా దృష్టిలో బలహీనుడు; ఎప్పటి వరకయితే అతను కాజేసిన హక్కును హస్తగతం చేసుకోనో – ఇన్షా అల్లాహ్. ఒకవేళ ప్రజలు జిహాద్ చేయడం మానుకుంటే అల్లాహ్ వారిని అవమానం పాల్జేస్తాడు. ఏ జాతిలోనైతే నీతిబాహ్యత, విచ్చలవిడితనం ప్రబలుతుందో ఆ జాతి మీద దైవ శిక్ష, విభిన్న రకాల ఉపద్రవాలు విరుచుకుపడ్తాయి. ఓ ప్రజలారా! నేను అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త బాటన నడుస్తున్నంత కాలం మీరు నన్ను అనుసరించండి. నేను అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త (స) మార్గాన నడవడం లేదని మీరు గ్రహిస్తే మీరు నన్ను అనుసరించాల్సిన అవసరం లేదు".

హజ్రత్ అబూబకర్ (ర) గారి గుణవిశేషాలు:

ఆయన గొప్ప దూరదృష్టి గలవారు, న్యాయవంతులు, వినమ్రులు, నిరాడంబరులు, నీతిమంతులు. ప్రతి విషయంలోనూ ఆయన ప్రజల కోసం ఆదర్శంగా అలరారారు. అజ్ఞాన కాలంలో సయితం ఆయన మద్యానికి, మగువ లోలత్వానికి, ఇతరత్రా వ్యాపకాలు, వ్యసనాలకు దూరంగా మసలుకునేవారు, వాటిని అసహ్యించుకునేవారు. పరిపాలన విషయంలో ఆయన మహా గొప్ప అనుభవజ్ఞులు. ఎట్టి క్లిష్టతర పరిస్థితుల్లోనయినా అదరని బెదని వ్యక్తిత్వం ఆయనది.

ప్రశ్నోపనిషత్తు

1) హజ్రత్ అబూబకర్ (ర) గారికి ఖిలాఫత్ ఎలా అప్పగించబడింది?
2) హజ్రత్ అబూబకర్ (ర) గారి కొన్ని గుణవిశేషాలను పేర్కొనండి?
3) 'నేను మీకన్నా గ్పొవాణ్ణి మాత్రం కాను' అన్న ఆయన మాటల్లో ఆయన ఏ గుణంగా కనబడుతుంది?
4) ప్రసంగంలో ఆయన ప్రజలకు ఉపదేశించిన నైతిక విలువలేమిటి?
5) బలవంతుడు, బలహీనుడి గురించి హజ్రత్ అబూబకర్ (ర) గారి దృక్పథం ఏమిటి?

ఐపిసి వార్తలు



ఉమ్రా యాత్రలో జబలుర్రహ్మా దగ్గర ఐపిసి న్యూ ముస్లింల బృందం



విద్యార్థులకు పట్టాలు పంచుతున్న దృశ్యం



ఖైతాన్ బ్రాంచీ ఆధ్వర్యంలో నిర్వహించబడిన అరబీ క్లాస్ విద్యార్థులు



విహారయాత్రలో ఐపిసి సిటీ బ్రాంచీ విద్యార్థులు



జంతు ప్రదర్శనాశాల లోపలి ఒక దృశ్యం



ఉద్యానవనంలో సేదతీరుతున్న విధ్యార్థులు



హవల్లీలో మేరాజ్ సందేశం మీద ప్రసంగిస్తున్న ఐపిసి ప్రబోధకులు షేఖ్ బిలాల్



బహుమతి అందుకుంటున్న సోదరుడు



మన తెలుగు సోదరులు

కువైట్ నగరానికి ప్రార్థనా సమయాలు

Timings legitimate local time for Kuwait City							2012 July	1433 Ramadan	Days a week
Isha	Magrib	Asar	Duhar	Sunrise	Fajar	Sahari			
M H	M H	M H	M H	M H	M H	M H			
8:16	6:47	3:29	11:54	5:01	3:29	3:19	20	1	Fri
8:16	6:47	3:29	11:54	5:01	3:30	3:20	21	2	Sat
8:15	6:46	3:29	11:54	5:02	3:31	3:21	22	3	Sun
8:14	6:45	3:30	11:54	5:03	3:31	3:21	23	4	Mon
8:13	6:45	3:30	11:54	5:03	3:33	3:23	24	5	Tue
8:13	6:44	3:30	11:54	5:04	3:33	3:23	25	6	Wed
8:12	6:44	3:30	11:54	5:04	3:34	3:24	26	7	The
8:11	6:43	3:30	11:54	5:05	3:35	3:25	27	8	Fri
8:10	6:42	3:30	11:54	5:05	3:35	3:25	28	9	Sat
8:09	6:42	3:30	11:54	5:06	3:36	3:26	29	10	Sun
8:08	6:42	3:30	11:54	5:07	3:37	3:27	30	11	Mon
8:07	6:41	3:30	11:54	5:07	3:38	3:28	31	12	Tue
8:06	6:40	3:30	11:54	5:08	3:39	3:29	1 August	13	Wed
8:05	6:40	3:30	11:54	5:08	3:40	3:30	2	14	The
8:04	6:39	3:30	11:54	5:09	3:41	3:31	3	15	Fri
8:03	6:38	3:30	11:54	5:10	3:41	3:31	4	16	Sat
8:02	6:37	3:30	11:54	5:10	3:42	3:32	5	17	Sun
8:01	6:36	3:30	11:54	5:11	3:43	3:33	6	18	Mon
8:00	6:35	3:29	11:54	5:11	3:44	3:34	7	19	Tue
7:59	6:34	3:29	11:54	5:12	3:45	3:35	8	20	Wed
7:58	6:33	3:29	11:54	5:12	3:46	3:36	9	21	The
7:57	6:32	3:29	11:53	5:13	3:46	3:36	10	22	Fri
7:56	6:31	3:29	11:53	5:14	3:47	3:37	11	23	Sat
7:55	6:31	3:29	11:53	5:14	3:48	3:38	12	24	Sun
7:54	6:31	3:28	11:53	5:15	3:49	3:39	13	25	Mon
7:53	6:30	3:28	11:53	5:15	3:50	3:40	14	26	Tue
7:51	6:29	3:28	11:53	5:16	3:50	3:40	15	27	Wed
7:50	6:28	3:28	11:53	5:16	3:51	3:41	16	28	The
7:49	6:27	3:27	11:53	5:17	3:52	3:42	17	29	Fri
7:48	6:26	3:27	11:53	5:18	3:53	3:43	18	30	Sat

Eid prayer: time 8:00 At Masjied Hamad